## ఊరించి.. ఉసూరుమనిపించి

### అతీగతీలేని 'మిషన్ వాత్సల్య'

**అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే:** అనాథ.. పాక్షిక అనాథ పిల్లలకు కొండంత అండగా నిలవాల్సిన 'మిషన్ వాత్సల్య' అతీగతీలేదు. జిల్లా అంతటా ఎడాపెడా అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కానీ.. వాటి మంజూరు ప్రశ్నార్థకంగా మారింది. నిర్దేశిత ప్రోత్సాహకం లభిస్తుందన్న గంపెడాశతో లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. నెలలు గడుస్తున్నా మంజూరు ఊసేలేదు. దీనిపై అధికార యంత్రాంగం సైతం ఏమీ చెప్పలేకపోతోంది. కొవిడ్-2019 తర్వాత ఈ పథకం అమల్లోకి వచ్చింది. ఈ క్రమంలోనే అనంత జిల్లా పరిధిలో 570 మందికి వాత్సల్య కింద ప్రోత్సాహకం లభిస్తోంది.

#### ప్రతి నెలా రూ.4 వేలు

జిల్లాలోని 11 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 334 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో పూర్తి అనాథ (తల్లిదండ్రుల్లేని) పిల్లలు 53 మంది ఉండగా..తల్లి లేదా తండ్రిలేని వారు 281 మంది ఉన్నారు. మంజూరు అయితే ప్రతి నెలా రూ.4 వేల ప్రకారం ప్రోత్సాహకం కింద వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. ఇప్పటికే 570 మందికి క్రమం తప్పకుండా వస్తోంది. 18 ఏళ్ల దాకా ఈ ప్రోత్సాహకం లభిస్తోంది. కొత్త దరఖాస్తుల పరిశీలన సైతం పూర్తి అయింది.

#### శింగనమలలో ఎక్కువ

మిషన్ వాత్సల్య పథకం కింద దరఖాస్తు చేసుకున్న 334 మందిలో శింగనమలలోనే ఎక్కువగా 94 మంది ఉన్నారు. ఆ తర్వాత అనంత అర్బన్‌లో 79 మంది, అనంత గ్రామీణంలో 54 మంది, కంబదూరులో 37 మంది, తాడిపత్రిలో 22 మంది, గుత్తిలో 17, ఉరవకొండలో 16 మంది, నార్పలలో 11 మంది, కణేకల్లులో ఇద్దరు, కళ్యాణదుర్గంలో ఒకరు చొప్పున ఉన్నారు. కొత్తగా మంజూరు కోసం నిరీక్షిస్తున్నారు. మిషన్ వాత్సల్య మంజూరుపై ఇప్పటిదాకా ఎలాంటి సమాచారం లేదని పీడీ సాజిదా బేగం తెలిపారు. దరఖాస్తులన్నీ పరిశీలించి సిద్ధంగా ఉంచాం. ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా ముందుకెళ్తామన్నారు.



## వధూవరులకు చంద్రబాబు ఆశీర్వాదం

గుంతకల్లు నియోజకవర్గ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుమార్తె విద్య, తెదేపా జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు కుమారుడు శివరాజ్‌ల వివాహం ఆదివారం అనంతపురంలో ఘనంగా జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబు రాకతో తమ్ముళ్ల కోలాహలం నెలకొంది. ఉమ్మడి అనంతపురం జిల్లా ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలంతా ఆయనకు స్వాగతం పలికారు. - **ఈనాడు, అనంతపురం**

## రుచించవు.. వంటబట్టవు

- రోగులకు అరకొరగా పప్పు, కూరల వడ్డింపు
- ఆసుపత్రుల్లో మెనూ అమలులో బాలారిష్టాలు

ప్రభుత్వాసుపత్రుల్లో ఇన్‌పేషెంట్లుగా చేరుతున్న రోగులకు డైట్ పథకం ప్రకారం కూర, సాంబారు, పెరుగుతో మధ్యాహ్న భోజనం పెట్టాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలోని ప్రధాన, పురపాలక ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ఇది సక్రమంగా పాటించడం లేదు. సాధారణ రోగులకు రూ.80, ఆరోగ్యశ్రీ రోగులకు రూ.100, బాలింతలకు రూ.100 చొప్పున భోజనానికి ఇస్తున్నారు. ఇది చాలదంటూ గుత్తేదారులు ఆసక్తి చూపకపోవడంతో కొన్నిచోట్ల భోజన పథకం కార్యరూపం దాల్చలేదు.



సర్వజనాసుపత్రిలో కంచంలో కలగాపుల గంగా వడ్డింపు

#### పప్పుతో సరిపెట్టేస్తూ..

**కదిరి పట్టణం:** 100 పడకలున్న ప్రాంతీయ వైద్యశాలలో సగటున 70 మందికి మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. చాలాసార్లు మెనూ పాటించకుండా పప్పుతోనే సరిపెట్టేశారు. కూర, సాంబారు ఇవ్వడం లేదు. పెరుగుకు బదులుగా మజ్జిగను ఇస్తున్నారు.

#### గిట్టుబాటు కాదని..

**గుత్తి:** గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి గుత్తి, గుంతకల్లు గ్రామీణం, కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి రోజుకు సగటున 350 మందికి పైనే వస్తున్నారు. ఇన్‌పేషెంట్లను ఉంచడం లేదు. డైట్ పథకం అమలు గిట్టుబాటు కాక గుత్తేదారులు ముందుకు రావడం లేదు.

**తనకల్లు, ఉరవకొండ, సీకేపల్లి:** గుత్తేదారులు ముందుకు రాక పథకం అమలు చేయడం లేదు. తనకల్లులో రోగులు బయట హోటళ్ల నుంచి భోజనం తెచ్చుకుంటున్నారు. ఉరవకొండలో 50 పడకల ఆసుపత్రిలో భోజనం పథకం అమలు చేయాలని కోరుతున్నారు. చెన్నేకొత్తపల్లిలోనూ ఇదే పరిస్థితి. హిందూపురంలో భవన సౌకర్యం లేక పథకం అమలు చేయడం లేదు.



ఉరవకొండ సీహెచ్‌సీలో బయటి నుంచి భోజనం తెచ్చుకొని తింటూ..

#### తక్కువ పరిమాణంలో..



**అనంతపురం (వైద్యం):** సగటున రోజుకు 600 నుంచి 1200 మంది వరకూ ఇన్‌పేషెంట్లు ఉన్న సర్వజన ఆసుపత్రిలో రోగులకు అందాల్సిన పరిమాణం కంటే తక్కువగా ఆహార పదార్థాలను (గుడ్లు, అరటిపండ్లు) ఇస్తున్నారు. పప్పు, రసం, సాంబారు వంటివి తక్కువ మోతాదులో వండి అందరికీ సర్దుబాటు చేస్తున్నారన్న విమర్శ ఉంది.

#### పర్యవేక్షణ పెంచుతాం

ఆహార పదార్థాలు నాణ్యతగా పెడుతున్నాం. మెనూ అమలుపై పర్యవేక్షణ పెంచుతాం. పరిమాణం తక్కువగా పెడుతున్నారన్న విషయం దృష్టికి వచ్చింది. గుత్తేదారులతో మాట్లాడి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ మల్లీశ్వరి, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల
- డేవిడ్ సిల్వరాజ్, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి





## కారుణ్యంలో కాసుల కక్కుర్తి

### జడ్పీలో ఉద్యోగుల తీరు

**తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే:** జిల్లా పరిషత్తులో కారుణ్య నియామకాల్లో పలువురు ఉద్యోగులు, గుత్తేదారులతో కుమ్మక్కై వసూళ్ల పర్వానికి తెరలేపారు. ఉద్యోగం ఎలాగైనా వస్తుంది... కోరుకున్న చోటుకు నియామకం పొందాలంటే కచ్చితంగా చేయి తడపాల్సిందేనంటూ డిమాండ్ చేస్తున్నారు. ఆదివారం రాత్రి కూడా జడ్పీ కార్యాలయంలో మంతనాలు జరిగినట్లు విశ్వసనీయ సమాచారం. కరోనా, అనారోగ్య సమస్యలు, ప్రమాదాల్లో చాలామంది ఉద్యోగులు మరణించారు. మృతుల్లో జడ్పీ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు, బోధనేతర ఉద్యోగులు ఎక్కువ మంది ఉన్నారు. బాధిత కుటుంబ సభ్యుల్లో ఒకరికి సీనియారిటీ ప్రకారం ఉద్యోగ అవకాశం కల్పిస్తారు. ఇందులో భాగంగా జడ్పీలో మొత్తం 59 మందికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పిస్తున్నారు. ఇందుకు కూటమి ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో చకచకా దస్త్రాలు సిద్ధం చేశారు. 24 మంది జూనియర్ సహాయకులు, 24 మంది టైపిస్టులు, 11 మంది ఆఫీస్ సబార్డినేటర్ ఉద్యోగాలను భర్తీ చేస్తున్నారు. వీరందరికీ సోమవారం నియామక పత్రాలు అందజేయాలని నిర్ణయించారు.

#### ఫోన్లలో బేరసారాలు

ఉద్యోగం పొందనున్న వారికి గుత్తేదారులు ఫోన్లు చేసి బేరసారాలు కుదుర్చుకున్నారు. ఒక్కొక్కరితో రూ. లక్ష వరకు డిమాండ్ చేసినట్లు బాధితులు చెబుతున్నారు. ఇప్పటికే అనేక మంది పోస్టింగ్‌ల కోసం డబ్బులు సమర్పించుకున్నట్లు తెలిసింది. ఈ విషయమై జడ్పీ సీఈఓ విజయలక్ష్మి వివరణ కోరగా.. ఎవరైనా డబ్బులు డిమాండ్ చేసినట్లు ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి నియామక పత్రాలు అందజేస్తామన్నారు. ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు.

## నేడు పీజీఆర్ఎస్

**జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే:** ప్రతి వారం తరహాలోనే ఈ సోమవారం కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాల ద్వారా అర్జీల స్వీకరణ ఉంటుందని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. తనతోపాటు జేసీ విష్ణుచరణ్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని చెప్పారు. గతంలో అర్జీలు ఇచ్చి ఉంటే తగిన రసీదు వెంట తీసుకుని రావాలన్నారు. ఏ సమస్య అయినా సరే వినతులు ఇవ్వవచ్చు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## రైల్వే సీనియర్ డీసీఎం బాధ్యతల స్వీకరణ


సత్యనారాయణ

**గుంతకల్లు, న్యూస్‌టుడే:** ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానని గుంతకల్లు రైల్వే డివిజన్ సీనియర్ డీసీఎం కె.సత్యనారాయణ తెలిపారు. ఆయన ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు డీసీఎంగా పనిచేస్తున్న మనోజ్ వారం రోజుల క్రితం కర్ణాటక మండలం నియంత్రణ విజిలెన్స్ అధికారిగా డిప్యుటేషన్‌పై వెళ్లిన విషయం పాఠకులకు తెలిసిందే. ఆయన స్థానంలో తిరుపతి రైల్వేస్టేషన్ డైరెక్టరుగా ఉన్న సత్యనారాయణ నియమితులయ్యారు. గుంతకల్లు డివిజన్‌లో టికెట్లు లేకుండా రైళ్లలో ప్రయాణించే వారిని నిరోధిస్తామని చెప్పారు. వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది తోడ్పాటుతో ముందుకు సాగుతామని వెల్లడించారు.

# కూతకెళ్లి.. పతకాలు పట్టి

### జాతీయస్థాయిలో యువతుల రాణింపు

కూతకెళ్లి పాయింట్లు పట్టుకొచ్చే పతకాలు కొల్లగొట్టారు మన కబడ్డీ వనితలు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో అద్భుత ఆటతీరుతో అందరిని మెప్పిస్తున్నారు. చిన్ననాటి నుంచే క్రీడల్లో శిక్షణ తీసుకుంటూ విజయాలు సాధిస్తున్నారు. శిక్షకుడు లక్ష్మీనరసింహ తన సొంత ఖర్చులతో వారిని మ్యాచ్‌లకు తీసుకెళుతూ ప్రోత్సహిస్తున్నారు. తమ విజయాలు వారి మాటల్లోనే తెలుసుకుందాం రండి... **-న్యూస్‌టుడే, తాడిపత్రి**

### పాయింట్ వచ్చే వరకు వదలను



మాది తాడిపత్రి మండలం యర్రగుంటపల్లి. అమ్మానాన్నలు గంగరాజు, తులసి. నాన్న కూలి పనులు చేసి కుటుంబం నన్ను పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివిస్తున్నారు. నాకు ఇష్టమైన కబడ్డీలో ఎనిమిదేళ్లుగా శిక్షణ ఇప్పిస్తున్నారు. ఇప్పటివరకు ఏడు జాతీయ స్థాయి పోటీల్లో తలపడ్డా. యూనివర్సిటీ స్థాయిలో చెన్నైలో జరిగిన సౌత్‌జోన్, ఈ నెల 28న తిరుపతిలో నిర్వహించిన అమరావతి ఛాంపియన్‌షిప్ రాష్ట్ర స్థాయి పోటీల్లో తలపడి జట్టు విజేతగా నిలవడంలో కీలకపాత్ర పోషించా. పాయింట్లు తెచ్చుకునే వరకు కూత వదలకపోవడమే నా ప్రత్యేకత. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో 35 పతకాలు వచ్చాయి. జాతీయ జట్టులో చోటు సంపాదించి అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకోవాలన్నదే నా లక్ష్యం. **-గౌతమి, డిగ్రీ ద్వితీయ సంవత్సరం**

### జాతీయ జట్టులో స్థానమే లక్ష్యం



తాడిపత్రిలోని పవర్ నగర్‌లో ఉంటున్నాం. అమ్మానాన్నలు బాదర్ బాషా, హాజీరా. నాన్న వెల్డింగ్ పనిచేస్తూ నన్ను ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివిస్తున్నారు. ఆరో తరగతి నుంచే కబడ్డీలో శిక్షణ ఇప్పిస్తున్నారు. ఇప్పటివరకు విజయవాడ, కర్నూలు, అనంతపురం, తిరుపతిలో నిర్వహించిన ఏడు రాష్ట్రస్థాయి పోటీల్లో తలపడ్డా. గతేడాది కబడ్డీ సంఘం ఆధ్వర్యంలో హరియాణాలో జరిగిన జాతీయ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపా. ఈ నెల 28న తిరుపతిలో జరిగిన అమరావతి ఛాంపియన్‌షిప్‌లో జట్టు మొదటి స్థానంలో నిలవడంతో ప్రధాన పాత్ర పోషించడం ఆనందంగా ఉంది. జాతీయ జట్టులో చోటు సంపాదించి అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకోవాలన్నదే నా ధ్యేయం. **-సుహానా, డిగ్రీ ప్రథమ ఏడాది**

# అధినేత రాకతో అనంతలో సందడి

**ఈనాడు, అనంతపురం; రాంనగర్, న్యూస్‌టుడే:** అనంతపురంలో ఆదివారం వివాహ వేడుకకు హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉమ్మడి జిల్లా తెదేపా నేతలు స్వాగతం పలికారు. మంత్రులు పయ్యావుల కేశవ్, టీజీ భరత్, ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారథి, ఎమ్మెల్సీ రామచంద్, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, పల్లె సింధూరారెడ్డి, శ్రావణిశ్రీ, కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు, దగ్గుపాటి ప్రసాద్, కందికుంట వెంకటేశ్వరప్రసాద్, ఎం.ఎస్.రాజు, జేసీ అస్మిత్‌రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యేలు ప్రభాకర్ చౌదరి, జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఏడీసీసీ ఛైర్మన్ కేశవరెడ్డి తదితరులు ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

### గంటలోనే ముగిసిన సీఎం పర్యటన

మధ్యాహ్నం 2.25కు శిల్పారామం వద్ద హెలిప్యాడ్‌కు చేరుకున్న చంద్రబాబు పార్టీ నేతలు, అధికారులను పలుకరించాక నేరుగా బళ్లారి రోడ్డులోని ఎంవైఆర్ కల్యాణ మండపానికి చేరుకున్నారు. వధూవరులను ఆశీర్వదించారు. 3 నుంచి 3.10 వరకు కల్యాణ మండపంలో ఉన్న సీఎం తిరిగి హెలిప్యాడ్‌కు చేరుకుని 3.30కు బయలుదేరి వెళ్లారు.

● హెలిప్యాడ్ వద్ద సీఎంకు స్వాగతం పలికేందుకు వచ్చిన సందర్భంలో మాజీ ఎమ్మెల్యేలు జేసీ ప్రభాకర్‌రెడ్డి, వైకుంఠం ప్రభాకర్‌చౌదరి కాసేపు ముచ్చటించుకున్నారు.


వివాహ వేడుకలో కార్యకర్తలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

# డిసెంబరుకు అన్ని ప్రాంతాల్లో విద్యుత్తు బస్సులు


పరిశీలిస్తున్న ఆర్టీసీ ఛైర్మన్ కొనకొండ్ల నారాయణ

**అనంతపురం (అశోక్‌నగర్), న్యూస్‌టుడే:** రాష్ట్రంలోని అన్ని డిపోల్లో ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు పనులు వేగంగా సాగుతున్నాయని డిసెంబరుకు అన్ని ప్రాంతాల్లో విద్యుత్తు బస్సులు ప్రారంభమవుతాయని ఆర్టీసీ ఛైర్మన్ కొనకొండ్ల నారాయణరావు పేర్కొన్నారు. ఆదివారం అనంతపురంలోని ఆర్టీసీ డిపోలో విద్యుత్తు బస్సుల రాకకు సాగుతున్న పనులను ఆయన పరిశీలించారు. అనంతపురంలో డిసెంబరుకు పనులన్నీ పూర్తవుతాయని ఆయన వివరించారు. కొన్ని ప్రాంతాల్లో అక్టోబరు చివరికి 350 బస్సులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం 1050 విద్యుత్తు బస్సులు వస్తున్నాయని పేర్కొన్నారు. స్త్రీ శక్తి పథకం ద్వారా ప్రభుత్వంపై రూ.3 వేల కోట్లకు పైగా భారం పడినా ఎక్కడా వెనుకంజ వేయకుండా కొనసాగిస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రయాణికుల సంఖ్య పెరగడంతో కొంత సమస్య ఉన్నా ఎలక్ట్రిక్ బస్సుల రాకతో తీరిపోతుందన్నారు. కార్యక్రమంలో ఈడీఏ రవివర్మ, కడప జోన్ ఈడీ శ్రీకృష్ణ కిషోర్, జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీలక్ష్మి, డిప్యూటీ సీటీఎం ప్రశాంతి, డిపో మెనేజర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

# డ్రాగా ముగిసిన మూడురోజుల మ్యాచ్

### అర్జున్ తెండూల్కర్ శతకం వృథా


అర్జున్ తెండూల్కర్ (100 పరుగులు, 3 వికెట్లు)


కృష్ణతేజారెడ్డి (132)

**అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే:** ఓపెనర్ అర్జున్ తెండూల్కర్ (100 పరుగులు, 3 వికెట్లు) ఆల్‌రౌండ్ ప్రతిభను ప్రదర్శించినా. సౌత్‌జోన్ అండర్-23 అంతర్ జిల్లా క్రికెట్ పోటీలో చిత్తూరు జట్టు అనంతపురం జట్టుపై మొదటి ఇన్నింగ్స్‌లో 94 పరుగుల ఆధిక్యత సాధించింది. అనంత క్రికెట్ మైదానంలో ఆదివారం ఓవర్‌నైట్ స్కోర్ 342/5తో మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన చిత్తూరు జట్టు ఏజీ కృష్ణతేజారెడ్డి (132), పి.భవానీ ప్రసాద్ (73)లు అద్భుతమైన బ్యాటింగ్ చేయడంతో 130.4 ఓవర్లలో 531 పరుగులకు ఆలౌటైంది. అనంత బౌలర్లు పి.అర్జున్ తెండూల్కర్, టి.ప్రదీప్‌రెడ్డి చెరో మూడు వికెట్లు తీసి బ్యాటర్ల జోరుకు కళ్లెం వేశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు అర్జున్ తెండూల్కర్ (100) అజేయ శతకం, కెప్టెన్ వీరారెడ్డి (64), జయంత్‌కృష్ణ (54)లు వీర విహారం చేయడంతో 36.3 ఓవర్లలో 4 వికెట్లకు 254 పరుగులు చేసింది. ముగ్గురు బ్యాటర్లు టీ20 తరహాలో బ్యాటింగ్ చేయడంతో తక్కువ ఓవర్లలోనే స్కోరు నమోదైంది. చిత్తూరు జట్టుకు రెండో ఇన్నింగ్స్ ఆడే అవకాశం లేకపోవడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ పోటీలకు సోమవారం విరామం. మంగళవారం నుంచి నాలుగో రౌండ్ పోటీలు ప్రారంభమవుతాయని జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి టి.శ్రీధర్ తెలిపారు.

# రవి ఆశయాలు కొనసాగిస్తాం


నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

**రామగిరి, న్యూస్‌టుడే:** మాజీ మంత్రి, పరిటాల రవీంద్ర ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపారని, ఆయన ఆశయ సాధన కోసం నిరంతరం పనిచేస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం తెదేపా సమన్వయకర్త పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. పరిటాల రవీంద్ర జయంతి ఆదివారం వెంకటాపురంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పరిటాల రవీంద్ర ఘాట్‌కు ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్‌లు కుటుంబ సభ్యులతో కలిసి నివాళులు అర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన పరిటాల అభిమానులు, తెదేపా శ్రేణులు ఘాట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్‌లు మాట్లాడుతూ పేరూరు జలాశయానికి నీటిని తీసుకురావడం పరిటాల రవీంద్ర కల అని, అది త్వరలోనే నెరవేర్చనున్నట్లు వెల్లడించారు. రవి ఆశయసాధన కోసం శ్రీరామ్ ప్రతినిత్యం పనిచేస్తారని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో పరిటాల సిద్ధార్థ, తెదేపా నాయకులు బాలాజీ, రామ్మూర్తినాయుడు, సుధాకర్, శ్రీధర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ సమాచారం

**కదిరి, న్యూస్‌టుడే:** శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నేటి (సోమవారం) ఉదయం 6 గంటల నుంచి 6.45 గంటల వరకు స్వామివారి దర్శనం కల్పిస్తారు. శ్రీవారికి 7 గంటల నుంచి 9 గంటల వరకు అభిషేక, స్వర్ణకవచ సేవలు. 10.30 గంటలకు ఆలయంలో స్వామివారికి ఆర్జిత కల్యాణం. 9 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, తిరిగి సాయంత్రం 5 నుంచి రాత్రి 8.30 గంటల వరకు సర్వదర్శనం ఉంటుంది.

## ప్రైవేట్ రంగ సంస్థల్లోనూ రిజర్వేషన్లు అమలు చేయాలి

**ఆగిరిపల్లి, న్యూస్‌టుడే:** ప్రైవేట్ రంగ సంస్థల్లోనూ రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రైవేటు రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఆగిరిపల్లిలోని మంగళపూడి నాగేశ్వరరావు భవన్‌లో సామాజిక శాస్త్రవేత్తల సదస్సును ఆదివారం నిర్వహించారు. సోషలిస్టు కూటమి జాతీయ కార్యదర్శి ఎల్.జె.బాబు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. ప్రైవేట్ ఉపాధ్యాయులు, ఉద్యోగుల వేతన చట్టం బిల్లు పార్లమెంట్‌లో పెట్టాలని, విద్యా సంస్థల్లో విద్యార్థి ఎన్నికలు తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎం.నాగేశ్వరరావు, ఎల్.సాధు సుందర్‌సింగ్, వంగా రవికుమార్, కడప, కర్నూలు, అనంతపురం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## పంట కాలువలకు నీరు ఇవ్వలేదు

**అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే:** హెచ్చెల్సీ, జీబీసీ కింద ఉన్న పంట కాలువలకు (డిస్ట్రిబ్యూటరీ) నీరు విడుదల చేయలేదని హెచ్చెల్సీ ఎస్ఈ సుధాకర్‌రావు పేర్కొన్నారు. కేవలం తాగునీటికి మాత్రమే నీరు ఇస్తున్నామని వెల్లడించారు. శనివారం రాత్రి పంట కాలువలకు నీరు విడుదల చేశారంటూ కొన్ని సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. రైతులు,

**హెచ్చెల్సీ ఎస్ఈ సుధాకర్‌రావు**

ప్రజలను పక్కదారి పట్టించేలా దుష్ప్రచారం చేసే వారిపై పోలీసు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నీటి లీకేజీలను ఎప్పటికప్పుడు అరికడుతున్నాం. నీటి సరఫరా విషయంలో రాజకీయ కుట్రలు చేస్తున్న వైనాన్ని రైతులు గుర్తించాలన్నారు. ఏ విషయమైనా ముందస్తుగా ప్రకటిస్తామన్నారు.

## వేదోక్తంగా అన్నాభిషేకం


అన్నాభిషేకంలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

**ఆత్మకూరు, న్యూస్‌టుడే:** పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా ఆదివారం విశేష పూజలు చేశారు. శ్రావణ మాసం మూడో ఆదివారం సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, మంజునాథ స్వామి వారికి వేదోక్తంగా అన్నాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి వారికి అర్చన, మహానైవేద్యం అనంతరం పల్లకీసేవ, స్వర్ణకవచ సేవ, రథోత్సవం చేశారు. యాగమండపంలో నిర్వహించిన రాహుకేత, కుజదోష, సర్పదోష, కాలసర్పదోష హోమాల్లో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## సజావుగా నీట్ పీజీ పరీక్ష

### 98.77% మంది హాజరు

**జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే:** వైద్య విద్యలో పోస్టు గ్రాడ్యుయేషన్(పీజీ) ప్రవేశానికి జరిగిన ప్రతిష్ఠాత్మక నీట్ పరీక్ష సజావుగా ముగిసింది. ఆదివారం అనంతపురం, తాడిపత్రిలోని ఐదు కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించారు. మొత్తం 979 మంది ఎంబీబీఎస్ వైద్యులు హాజరు కావాల్సి ఉండగా.. 967 మంది పరీక్ష రాశారు. 98.77 శాతం హాజరు నమోదైంది. 12 మంది గైర్హాజరయ్యారు. ఎక్కడా ఏ సమస్య తలెత్తకుండా ప్రశాంతంగా ముగియడంతో జిల్లా అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. అనంత శివారులోని ఎస్ఆర్ఐటీ, అనంత లక్ష్మి, చిన్మయనగర్‌లోని జాతీయ కౌన్సిల్ ఫర్ చర్చ్, తాడిపత్రిలోని సీవీ రామన్, తాడిపత్రి ఇంజనీరింగ్ కళాశాలల్లో నీట్ పీజీ పరీక్ష జరిగింది. కలెక్టర్ ఆనంద్ ఎప్పటికప్పుడు పరీక్ష నిర్వహణ తీరును పర్యవేక్షించారు.

## మిరపకు తెగులు.. రైతు కుదేలు



ఎల్‌నినో ప్రభావం.. పంటలు ఓ వైపు వాడిపోతుంటే మరోవైపు పంటలకు తెగులు సోకుతుంది. పంటలో పెంపకం లేకపోవడమో లేదా చనిపోవడం జరుగుతుంది. ఈ క్రమంలోనే విడపనకల్లు మండలం ఎన్.తిమ్మాపురానికి చెందిన రైతు గోవిందు తన మిరప పంటను ఆదివారం ట్రాక్టర్‌తో తొలగించారు. 4 ఎకరాల్లో మిరపను సాగు చేయగా 40 రోజుల్లోనే పంటకు ఆకులు ముడత, వేర్లు నల్లగా మారడం వంటి తెగుళ్లు సోకాయి. దాదాపుగా రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లిందని వాపోయారు. ఓ పక్క అధికారులు సాగుకు నీరు ఇవ్వలేమని చెప్తుంటే.. మరోపక్క భూగర్భ జలాలు అడుగంటుతుంటే రైతన్నలకి దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. **- న్యూస్‌టుడే, విడపనకల్లు**

# హ్యామ్‌తో అభివృద్ధి పరుగులు

### నగర, పురపాలికల్లో మెరుగుపడనున్న సౌకర్యాలు

**అనంతపురం(అశోక్‌నగర్), న్యూస్‌టుడే:** అనంతపురం నగరంతో పాటు ఉమ్మడి జిల్లాలోని పలు పట్టణాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సరికొత్త విధానం అమలు చేయబోతున్నారు. నిత్యం ప్రజలు ఎదుర్కొనే సమస్యలకు తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఈ విధానం వల్ల రోడ్లు, మురుగు కాలువలు, తాగునీటి వ్యవస్థ, విభాగినులు, ఉద్యానవనాలు, సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ మెరుగు పడనుంది. పురపాలికలకు సొంత భవనాలు నిర్మించుకోవడానికి నిధులు ఇస్తారు. హైబ్రీడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) విధానంలో నిధుల మంజూరుకు సంబంధించి ఉత్తర్వులు విడుదల చేశారు.

### కన్సల్టెన్సీలతో గుర్తించి అంచనా

ఒక్కో ప్రాంతంలో ఒక కన్సల్టెన్సీ ద్వారా అత్యవసర సమస్యలను గుర్తిస్తారు. ఏ పనికి ఎంత అవసరమో సదరు సంస్థలే నివేదిస్తాయి. ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో టెండర్లు నిర్వహించే ప్రక్రియను పూర్తి చేసి కమిషనర్ల ఆధ్వర్యంలో పనులు చేపట్టనున్నారు. ఒక ట్రెండు రోజుల్లో టెండర్లు పూర్తి చేయడానికి కసరత్తు చేస్తున్నారు.

### అమలు ఇలా..

నగర, పురపాలికల్లో పనులను ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, ఏజెన్సీల ద్వారా చేపట్టడాన్ని 'హ్యామ్'గా నిర్ణయించారు. ప్రాజెక్టుకు అవసరమైన నిధులను మొదట 40 శాతం ప్రభుత్వం భరిస్తుంది. 60 శాతం టెండరు దక్కించుకున్న సంస్థ ద్వారా చేస్తారు. వాయిదాల పద్ధతుల్లో చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించిన విధి విధానాలకు ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ సమావేశాల్లో ఆమోదం లభించింది. ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న చిన్న పురపాలికల్లో అభివృద్ధి పనులు చేయడానికి ఉపయుక్తంగా ఉంటుంది.

● హ్యామ్ నిధులతో అనంతపురం జిల్లాలో రూ.174 కోట్లతో, శ్రీసత్యసాయి జిల్లాలో రూ.133 కోట్లతో పనులు చేపట్టనున్నారు.

● అనంతపురం నగరంలో 27600 మీటర్ల సిమెంటు రోడ్డు, 1250 మీటర్ల తారు రోడ్డు, 1050 మీటర్ల డివైడర్లు, 1050 సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టనున్నారు.

● గుత్తిలో రూ.3.30 కోట్లు, పుట్టపర్తిలో రూ.3.50 కోట్లతో పురపాలక కార్యాలయాల నిర్మాణాలకు ప్రతిపాదించారు.

| ప్రాంతం | నిధులు రూ.కోట్లలో |
|---|---|
| అనంతపురం | 50 |
| గుంతకల్లు | 39 |
| తాడిపత్రి | 39 |
| రాయదుర్గం | 36 |
| గుత్తి | 18 |
| కళ్యాణదుర్గం | 19 |
| హిందూపురం | 14 |
| ధర్మవరం | 45 |
| కదిరి | 29 |
| పుట్టపర్తి | 17 |
| మడకశిర | 12 |
| పెనుకొండ | 16 |

## కాటికోటేశ్వరుడికి విశేష పూజలు



**తాడిమర్రి, న్యూస్‌టుడే:** మండలం పరిధి చిల్లవారిపల్లి గ్రామ సమీపంలో కాటికోటేశ్వర క్షేత్రంలో ఆదివారం శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని మూల విరాట్‌కు ఘనంగా పూజలు చేశారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు తాకిడి ఎక్కువగా ఉండటంతో దేవాదాయ శాఖ అన్ని ఏర్పాట్లను చేశారు.



## చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

**పరిగి:** మండల పరిధిలోని పెద్దరెడ్డిపల్లిలో డీఎన్ ఆదినారాయణ ఇంటి తాళాలు పగుల గొట్టి బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేసిన ముగ్గురు నిందితులను ఆదివారం అరెస్టు చేసినట్లు పెనుకొండ సీఐ రాఘవన్, పరిగి ఎస్సై రవికుమార్ తెలిపారు. మండల పరిధిలోని పెద్దరెడ్డిపల్లిలోని నరసింహమూర్తి, ఉప్పర సురేష్ తదితరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 111 గ్రాములు బంగారు ఆభరణాలు, 6 గ్రాముల వెండి స్వాధీనం చేసుకున్నామన్నారు. మిగిలిన చోరీ సొత్తు గురించి దర్యాప్తు కొనసాగిస్తున్నామని సీఐ తెలిపారు.

## నలుగురిపై హత్యాయత్నం కేసు

**బొమ్మనహాళ్:** మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలో శనివారం రాత్రి ఉరవకొండ మండలం పెద్ద ముష్టూరు గ్రామానికి చెందిన చరణ్‌పై వేట కొడవళ్లతో దాడి జరిగిన ఘటనలో నలుగురిపై హత్యాయత్నం కేసును నమోదు చేసినట్లు ఎస్సై నబీరసూల్ తెలిపారు. పోలీసుల వివరాల మేరకు. ముష్టూరు గ్రామానికి చెందిన చరణ్ అదే గ్రామానికి చెందిన ఓ యువతితో ప్రేమ వ్యవహారం సాగించడంతో ఇరువురు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. దీనిపై పోలీసులు రాజీ చేశారు. యువకుడు శ్రీధరఘట్ట గ్రామంలో బంధువుల ఇంట్లో తలదాచుకొని సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టడంతో ప్రత్యర్థులు వేటకొడవళ్లతో దాడి చేశారు. మునీంద్ర, నారయణస్వామి, వన్నూరుస్వామి, ప్రసాద్‌పై హత్యాయత్నం కేసును నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఆదివారం ఆయన ఘటన స్థలాన్ని పరిశీలించారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

## వ్యసనాలకు బానిసై ఆత్మహత్య

**పామిడి:** పట్టణంలోని టీచర్స్ కాలనీలో ఉంటున్న యువకుడు భాస్కర్(33) ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. వ్యసనాలకు బానిసైన భాస్కర్ ప్రవర్తన నచ్చక ఏడాది క్రితం ఆయన భార్య పుట్టింటికి వెళ్లింది. ఆమె కాపురానికి రాకపోవడం, తన వ్యసనాలు మానుకోలేక పోవడంతో జీవితంపై విరక్తి చెందాడు. ఈ నేపథ్యంలో ఆదివారం ఇంట్లో ఇనుప కొక్కికి ఉరేసుకొని చనిపోయాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# యువకుడి దారుణ హత్య

**అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే:** నగర శివారులో శనివారం అర్ధరాత్రి ఓ యువకుడిని నలుగురు వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. ఘటనకు వివాహేతర సంబంధమే కారణమని పోలీసులు భావిస్తున్నారు. అనంత గ్రామీణం పోలీసులు తెలిపిన వివరాల మేరకు..నగరంలోని తపోవనం ప్రాంతానికి చెందిన మఠం సోమశేఖర్ చిన్న కుమారుడు భరద్వాజ్ (33) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. అతను అవివాహితుడు. అతనికి నగరంలోని ఓ టిఫిన్ సెంటర్ నిర్వాహకురాలితో పరిచయం ఏర్పడింది. అది వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ విషయం ఆమె భర్త శ్రీహరికి తెలియడంతో పలుమార్లు భరద్వాజ్‌ను హెచ్చరించాడు. అయినా అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈ ఏడాది మార్చిలో అతను సదరు మహిళను తీసుకెళ్లడంతో వన్‌టౌన్‌లో కిడ్నాప్ కేసు నమోదై జైలుకెళ్లొచ్చాడు. ఈ నేపథ్యంలో హత్యకు గురయ్యాడు.


మఠం భరద్వాజ్

### మహిళతో ఫోన్ చేయించి

భార్యతో భరద్వాజ్ వివాహేతర సంబంధం కొనసాగిస్తుండడంతో భర్త శ్రీహరి రగిలిపోయాడు. ఎలాగైనా హతమార్చాలని వ్యూహం పన్నాడు. శనివారం రాత్రి భార్య ఫోన్ నుంచి భరద్వాజ్‌కు ఫోన్ చేయించి బళ్లారి రోడ్డులోని ఆరాధ్య హోమ్స్ ప్రాంతంలోని నిర్జన ప్రదేశంలోకి రావాలని పిలిపించారు. కారులో అక్కడికి చేరుకున్న భరద్వాజ్‌ను అనుసరిస్తూ వచ్చిన శ్రీహరి, అతని బంధువులు అనిల్, కుమార్, రామాంజిలు ఒక్కసారిగా కొడవళ్లు, రాళ్లతో అతడిపై దాడి చేశారు. దాడిలో అతని కుడిచేయి తెగిపడింది. తీవ్రగాయాలై రక్తపు మడుగులో పడి కొట్టుమిట్టాడుతుండగా, నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. స్థానికులు గమనించి అనంత రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. అర్బన్ డీఎస్పీ చంద్రశేఖర్, సీఐ శ్రీకాంత్, సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని తీవ్రంగా గాయపడిన భరద్వాజ్‌ను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు అనంతపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏడు ప్రత్యేక బృందాలతో హంతకుల కోసం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు.

## హంద్రీనీవా కాలువలో దూకిన దంపతులు

### ● భార్య మృతదేహం లభ్యం ● గల్లంతైన భర్త


సోమలింగమ్మ


సీతన్న

**గుంతకల్లు పట్టణం, చిప్పగిరి, న్యూస్‌టుడే:** గుంతకల్లు గ్రామీణ మండలంలోని హంద్రీ నీవా కాలువలో దూకిన దంపతుల్లో ఒకరు మృతి చెందగా, మరొకరు గల్లంతైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. కసాపురం ఎస్సై వెంకటస్వామి, స్థానికులు తెలిపిన మేరకు. కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం బెల్డోణ గ్రామానికి చెందిన సీతన్న(64), సోమలింగమ్మ(60) దంపతులు. ఉదయం గుంతకల్లు ఆసుపత్రికి వెళుతున్నట్లు కుటుంబ సభ్యులకు చెప్పి కసాపురం చేరుకున్నారు. కసాపురం-మద్దికెర మధ్య ప్రవహించే హంద్రీనీవా కాలువలో స్నానం చేయడానికి అన్నట్టుగా మొబైల్, చిన్న పుస్తకం, చెప్పులు, ఇతర సామగ్రి గట్టుపై పెట్టారు. ఇద్దరూ కలిసి ఒక్కసారిగా కాలువలోకి దూకారు. గమనించిన స్థానికులు వారిని రక్షించడానికి ప్రయత్నించేలోపు మునిగిపోయారు. ఒడ్డున పెట్టిన పుస్తకంలోని చరవాణి నంబర్ల సాయంతో స్థానికులు దంపతుల బంధువులకు సమాచారం ఇచ్చారు. కొన్ని గంటల తర్వాత బంధువులు, పోలీసులు అక్కడికి చేరుకుని కాలువలో గాలించారు. రైల్వే ట్రాకు దగ్గరలో సోమలింగమ్మ మృతదేహం లభించింది. పోస్టుమార్టం నిమిత్తం గుంతకల్లు ఏరియా ఆసుపత్రికి తరలించారు. సీతన్న కోసం గాలింపు సాగుతోంది. వారిద్దరి ఆరోగ్యం బాగోలేదని, సీతన్నకు ఇటీవల శస్త్రచికిత్స జరిగిందని, ఆ బాధతోనే ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని వారి కుమారుడు నారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

## వివాహానికి వెళ్లి వస్తూ.. రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

### మరొకరికి తీవ్ర గాయాలు


శ్రీరాములు

**మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే:** వివాహానికి వెళ్లి వస్తున్న ఓ వ్యక్తిని కారు రూపంలో మృత్యువు కబళించిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ తెలిపిన వివరాలిలా.. కదిరికి చెందిన శ్రీరాములు (50) కొంతకాలం క్రితం అన్నమయ్య జిల్లా మదనపల్లెలోని కొత్తఇండ్లలో నన్నారి వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈయనకు భార్య నీలమ్మ, కుమార్తెలు మమత, భూమిక ఉన్నారు. ఉదయం సీటీఎం గ్రామంలో వీరి బంధువుల వివాహానికి వెళ్లారు. అనంతరం ఆయన బంధువైన బండ్లపాయి గ్రామానికి చెందిన లక్ష్మీదేవి, శ్రీరాములు కలిసి ద్విచక్రవాహనంపై మదనపల్లెకు వస్తూ తట్టివారిపల్లె వద్ద ఉన్న తిరుపతి రోడ్డులో రాంగ్ రూట్‌లో వచ్చారు. అదే సమయంలో తిరుపతి వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి వారి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీరాములు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. లక్ష్మీదేవి తీవ్రంగా గాయపడగా తిరుపతికి రెఫర్ చేశారు. రూరల్ ఎస్ఐ విష్ణు నారాయణ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

## రైలు నుంచి పడి యువకుడి దుర్మరణం

**చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే:** ప్రమాదవశాత్తు రైలు నుంచి పడి యువకుడు వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన చెన్నేకొత్తపల్లి మండలం ప్యాదిండి గ్రామ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. హిందూపురం రైల్వే ఎస్సై లావణ్య తెలిపిన వివరాల మేరకు ధర్మవరం పట్టణం ఇందిరానగర్‌కు చెందిన హర్షవర్ధన్(21), ధర్మవరం నుంచి పెనుకొండ వైపు వెళ్లే రైలులో ప్రయాణిస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు రైలు నుంచి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. అతని జేబులో అనంతపురానికి వెళ్లే రైలు టిక్కెట్లు లభించాయి. మృతుడు చేనేత కార్మికుడు, అవివాహితుడు. అతనికి తల్లిదండ్రులు శ్రీనివాసులు, కాంతమ్మ ఉన్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

### కర్ణాటక వాసి..

**హిందూపురం, న్యూస్‌టుడే:** నారాయణపురం-పెనుకొండ రైల్వేస్టేషన్ మధ్య ఆదివారం మధ్యాహ్నం కర్ణాటక రాష్ట్రం హవేరీ తాలుకా, బసాపూర్‌కు చెందిన అరుణ్‌చావడి (28) ప్రమాదవశాత్తు రైలు కిందపడి మృతి చెందినట్లు ఎస్సై లావణ్య తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.

## లారీ క్యాబిన్‌లో ఇరుక్కుని డ్రైవర్..

**కదిరి పట్టణం, న్యూస్‌టుడే:** కదిరి మండలం ఎరుకలవాండ్లపల్లి సమీపంలో 42వ జాతీయ రహదారి పై ఆగి ఉన్న లారీని వెనకవైపు నుంచి వచ్చిన మరో లారీ ఢీకొన్న ప్రమాదంలో తమిళనాడు వేలూరుకు చెందిన డ్రైవర్ గణేశన్ (63)మృతి చెందాడు. కదిరి అప్‌గ్రేడ్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన మేరకు.. ఆదివారం తెల్లవారుజామున ఐరన్‌లోడ్‌తో వస్తున్న లారీ సాంకేతిక సమస్యతో ఎరుకలవాండ్లపల్లి వద్ద ఆగిపోయింది. అదే సమయంలో అనంతపురం వైపు నుంచి తమిళనాడు వెళ్తున్న మరో లారీ ఆగి ఉన్న లారీని ఢీకొంది. ప్రమాదంలో డ్రైవర్ గణేశన్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయారు. సమాచారం అందుకున్న అప్‌గ్రేడ్ సీఐ నిరంజన్‌రెడ్డి సిబ్బందితో పాటు అక్కడికి చేరుకుని స్థానికుల సాయంతో డ్రైవర్‌ను బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన అతను అప్పటికే మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.


ఇరుక్కుపోయిన గణేశన్

# రాయదుర్గం

• రాయదుర్గం • కళ్యాణదుర్గం • ఉరవకొండ

## నేడు వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠాపన

**బొమ్మనహాళ్, న్యూస్‌టుడే:** మండలంలోని దర్గాహొన్నూరు గ్రామంలో సోమవారం ఉదయం 11.30 గంటలకు వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించనున్నట్లు వాల్మీకి సంఘం నాయకులు పేర్కొన్నారు. విగ్రహ ప్రతిష్ఠాపనకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అందరు పాల్గొని విజయవంతం చేయాలని వాల్మీకి సంఘం నాయకులు కోరారు.



ఊరేగింపులో భక్తులు

## ఘనంగా రాఘవుడికి మధ్యారాధన పూజలు

**రాయదుర్గం, న్యూస్‌టుడే:** పట్టణంలో కోటలో వెలసిన శ్రీగురు రాఘవేంద్ర స్వామికి ఆదివారం మధ్యారాధన పూజలు జరిపారు. ఈ సందర్భంగా స్వామికి ఉదయం అష్టోత్తరం, పంచామృతాభిషేకం, పాదపూజ, ప్రవచనం, ప్రాకారోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. అర్చకులు ఆధ్వర్యంలో పలు ధార్మిక కార్యక్రమాలు జరిపారు. స్వామి వారిని పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.



పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

## ఎనిమిదేళ్లుగా జాప్యం



అనంతపురం నుంచి కర్ణాటకలోని హొనగళ్ వరకు 120 కిలో మీటర్ల జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా రాయదుర్గం పట్టణం వద్ద ఇనుప వంతెన ఏర్పాటులో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఫలితంగా ప్రజలు దాదాపు రెండు కిలోమీటర్లకు పైగా బైపాస్ రోడ్డులో ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఇటీవల వంతెన ఏర్పాటు బాధ్యతను కొత్త గుత్తేదారుకు అప్పగించారు. రెండు నెలల్లో పనులు పూర్తి చేస్తామని జాతీయ రహదారి విభాగం ఈఈ కుళ్లాయిరెడ్డి తెలిపారు. **- న్యూస్‌టుడే, రాయదుర్గం**

## బిల్లులు చెల్లిస్తున్నా.. కట్టెలపైనే తీగలు

### విద్యుత్తు స్తంభాలు లేక కాలనీవాసుల అవస్థలు

**రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే:** పట్టణంలోని పలు కాలనీలు ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా.. నేటికీ మౌలిక వసతులు లేకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రజలకు అత్యంత అవసరమైన విద్యుత్తు సరఫరా చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీకు తాము అన్ని పన్నులు చెల్లిస్తున్నా.. తమ ఆవేదన పట్టించుకునే నాథుడే కరవయ్యారని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

వాల్మీకి నగర్‌లో ఏడేళ్ల క్రితం కొన్ని చోట్ల విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేశారు. అయితే నేటికీ తీగలను లాగి కనెక్షన్ ఇవ్వక పోవడంతో అవి ఖాళీగా దర్శనమిస్తున్నాయి. కేజీబీవీకు వెళ్లే దారి, పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లే దారిలోనూ స్తంభాలు వృథాగా మారాయి. ఇదే కాలనీలో బీసీ బాలుర వసతి గృహం వెనుక స్థానికులు కట్టెలు ఏర్పాటు చేసుకుని విద్యుత్తు కనెక్షన్‌ను ఇళ్లకు తీసుకున్నారు. విద్యుత్తు బిల్లులు చెల్లించకపోతే కనెక్షన్ తొలగించే అధికారులకు మా గోడు పట్టదా! అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



వాణి పాఠశాల వెనుక కట్టెలపై తీగలు

### ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..

**-జయచంద్ర, ఏఈ ట్రాన్స్‌కో**

పట్టణంలో ఉన్న కాలనీల్లో స్తంభాలు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక నిధులు లేక పోవడంతో ఏర్పాటు చేయలేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి స్తంభాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. స్థానిక ప్రజల సమస్యలు పరిష్కరిస్తాం.

వాణి ఆంగ్ల మాధ్యమ పాఠశాల వెనుక ఉన్న నివాసాలకు విద్యుత్తు స్తంభాలు లేకపోవడంతో వరుసగా కట్టెలను ఏర్పాటు చేసుకుని తీగలను లాక్కున్నారు. ప్రతి నెలా తాము బిల్లులు చెల్లిస్తున్నా.. తమ బాధను ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే పలుమార్లు ఆదేశించినా నేటికి కార్యరూపం దాల్చలేదని స్థానికులు వాపోతున్నారు.

సిద్ధేశ్వర నగర్‌లో బైలాంజనేయస్వామి దేవాలయం సమీపంలో పలు చోట్ల స్తంభాలు లేకపోవడంతో కట్టెలపై తీగలను ఏర్పాటు చేసుకుని కాలం వెళ్లదీస్తున్నారు. పేదల సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు తమ గోడును మొరపెట్టుకుంటున్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా

రాయదుర్గం పట్టణం: 9666888046
కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661
ఉరవకొండ: 8008573071

**సమస్య:** పట్టణంలోని తహసీల్దార్ రోడ్డులో విద్యుత్తు తీగలు వేలాడుతుండటంతో గాలులు వీచినప్పుడు ఒకదానికి ఒకటి తగిలి నిప్పురవ్వలు రాలుతున్నాయి. **-అబ్దుల్**
**సమాధానం:** తీగలు సరి చేస్తాం. **-జయకృష్ణ, విద్యుత్తు శాఖ, ఏఈ**

**సమస్య:** పట్టణంలోని 5వ వార్డుకు వెళ్లే రోడ్డులో (కేబీ.ప్యాలెస్ వద్ద) పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. చెత్తలో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. చెత్త తొలగించేలా చర్యలు తీసుకోవాలి. **- సత్యనారాయణ**
**సమాధానం:** తొలగింపునకు వెంటనే చర్యలు తీసుకుంటాం. **- రవీంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్**
– న్యూస్‌టుడే, రాయదుర్గం

**సమస్య:** వజ్రకరూరులోని జగనన్న కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. **- రాజశేఖర్**
**సమాధానం:** పరిశీలించి దీపాలు ఏర్పాటు చేస్తాం. **- మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి**
– న్యూస్‌టుడే, వజ్రకరూరు

**సమస్య:** కుందుర్పి విద్యుత్తునగర్‌లో నీటి ట్యాంకుల వద్ద అపరిశుభ్రత నెలకొంది. **-గోపాల్**
**సమాధానం:** అపరిశుభ్రత తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **-యల్లక్క, పీడీవో**
**సమస్య:** మహంతపురంలో వృథాగా మారిన పశువుల తాగునీటి తొట్టెకు నీరు సరఫరా కావడంలేదు. **-సిద్ధు**
**సమాధానం:** మరమ్మతులు చేయించి నీటి సరఫరా చేయిస్తాం. **-లక్ష్మీశంకర్, ఎంపీడీవో**
–న్యూస్‌టుడే, కుందుర్పి

**సమస్య:** కాదలూరు నుంచి దొడగట్ట గ్రామానికి వెళ్లే దారిలో కల్వర్టు కుంగింది. రాకపోకలకు ఇబ్బంది అవుతుంది. **- ఆంజినేయులు**
**సమాధానం:** పరిశీలించి కల్వర్టు మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. **-నాగేంద్రప్రసాద్, ఆర్‌అండ్‌బీ ఏఈఈ**
**సమస్య:** మురడి గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఎదుట ప్రధాన రహదారిలో ప్లాస్టిక్, వ్యర్థ పదార్థాలతో పారిశుద్ధ్యం పేరుకుపోయింది. **- బసవరాజు**
**సమాధానం:** తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. **-సోమనాథ్, పంచాయతీ కార్యదర్శి**
–న్యూస్‌టుడే, డి.హీరేహాళ్

## పీజీఆర్‌ఎస్‌కు అధికారులు హాజరుకండి

**కళ్యాణదుర్గం: న్యూస్‌టుడే:** ప్రతి సోమవారం రెవెన్యూ డివిజనల్ కార్యాలయం, అన్ని మండలాల తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) అధికారులు అందరూ తప్పని సరిగా హాజరుకావాలని ఆర్డీవో వసంతబాబు ఆదేశించారు. ప్రతి చోట 'మీ కోసం టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1100' అనే బ్యానర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని తెలిపారు.

## 1,462 దరఖాస్తుల స్వీకరణ


**కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే:** సర్ ప్రక్రియలో భాగంగా నిర్వహించిన నాలుగు రోజుల ప్రత్యేక కార్యక్రమంలో ఫారం- 6, 7, 8లకు సంబంధించి ఓటర్ల నుంచి 1,462 దరఖాస్తులు స్వీకరించినట్లు ఆర్డీవో వసంతబాబు ప్రకటనలో తెలిపారు. ఈ నెలలో 22, 23, 29, 30వ తేదీల్లో నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌వోలు విధులు నిర్వహించి ఓటర్లకు సేవలు అందించారని పేర్కొన్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరిస్తామని తెలియజేశారు.

## బోరు బావులు నిర్లక్ష్యంగా వదిలేస్తే చర్యలు

**కుందుర్పి, న్యూస్‌టుడే:** మండలం వ్యాప్తంగా బోరు బావులు తవ్వించి, నీరు లభ్యం కాకుంటే మూతలు బిగించకుండా నిర్లక్ష్యంగా వదిలేస్తే.. బోరుబావుల యజమానులు, రైతులపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల పోలీస్ స్టేషన్ ఎస్సై మహేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సై మాట్లాడుతూ మండలంలో పంటలు సాగు చేసిన రైతులు ఎల్‌నినో ప్రభావంతో ఎండిపోతున్న పంటలను కాపాడుకునేందుకు బోరుబావుల తవ్వకం చేస్తున్నారని.. దీంతో నీటి మట్టం తగ్గిపోయి బోర్లలో నీరు పడని వాటిని వృథాగా వదిలేస్తున్నట్లు వెల్లడైంది. దీంతో ప్రమాదాలు సంభవించే ఆస్కారం ఉన్నందున వెంటనే పూడ్చివేశామన్నారు. బోర్‌వెల్ ప్రతినిధులు నీరు పడని బావులను వెంటనే భద్రంగా మూతవేయాలని సూచించారు.

## వేడుకగా శివలింగం ఆవిష్కరణ

**ఉరవకొండ, న్యూస్‌టుడే:** మండలం రాయంపల్లిలో పర్వతేశ్వర ఆలయం ఎదురుగా 18 అడుగుల భారీ శివలింగం ఆకృతితో ఆలయాన్ని నిర్మించారు. ఇందులో భాగంగా ఆదివారం శివలింగానికి పండితులు ప్రత్యేక పూజలను నిర్వహించి, ఆవిష్కరించారు. అది చూపరులను విశేషంగా ఆకట్టుకుంటోంది. శివలింగం కింద ఆలయంలో నందీశ్వరుని విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఉదయం నుంచి అభిషేకాలు, అర్చనలు నిర్వహించాడు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ పరిసరాలు వారితో రద్దీగా కనిపించాయి. కార్యక్రమ నిర్వాహకులు అన్నదానాన్ని చేపట్టారు.



శివలింగానికి పూజలు చేస్తున్న అర్చకులు

## అధినేతకు స్వాగతం





అనంతపురంలో వివాహ వేడుకకు హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబుకు పువ్వు అందించి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, అస్మిత్ రెడ్డి, అమిలినేని సురేంద్రబాబు **- ఈనాడు, అనంతపురం**

## ఎంఈఎఫ్ బలోపేతమే లక్ష్యం

**కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే:** మండలస్థాయి నుంచి బలోపేతం చేయడమే లక్ష్యమని మాదిగల ఉద్యోగుల సమాఖ్య (ఎంఈఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ అన్నారు. ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నియోజకవర్గ స్థాయి సమావేశం వారు మాట్లాడుతూ.. రాజ్యాంగం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం పోరాడుతున్నామన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఎస్సీ వర్గీకరణ ప్రకారం పదోన్నతులు కల్పించాలన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను సక్రమంగా అమలు చేయాలని రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. సమస్యలపై ప్రజాస్వామ్య బద్ధంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఎంఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు గంగాధర, జిల్లా ఇన్‌ఛార్జిగా రమేశ్, జిల్లా నాయకులుగా నగేష్, లక్ష్మణ్ ఎర్రిస్వామి, చిరంజీవి, మహేష్, రామస్వామి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

**ఉరవకొండ, న్యూస్‌టుడే:** ఉపాధ్యాయులు సత్సంబంధాలు కలిగి ఉండడం ద్వారా బోధనలో గుణాత్మక భావాలను పంచుకోవడానికి అవకాశం లభిస్తుందని పీఏసీఎస్ ఛైర్మన్ ప్యారం కేశవనంద, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరేశ్‌కుమార్, మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని ఎస్కే ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏపీటీఎఫ్ ఉపాధ్యాయులకు క్రీడా పోటీలను ప్రారంభించింది. వారు మాట్లాడుతూ క్రీడలు ఉల్లాసాన్ని, ఉత్సాహాన్నే కాకుండా ఐక్యతను నెలకొల్పుతాయని తెలిపారు. ఉపాధ్యాయులు క్రీడాపోటీల్లో పాల్గొని, తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు. ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఓబన్న, నాయకులు శ్రీనివాసులు, రంగప్రసాద్‌బాబు, లోకేశ్, భువనేశ్వర్ చౌదరి, రాజేశ్, రవి, మునిస్వామి, నజీర్‌అహమ్మద్, కృష్ణ, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కేశవనంద

## రూ.లక్షలు వెచ్చించి.. వినియోగం విస్మరించి



ఉరవకొండ శివరామిరెడ్డి కాలనీ శివారులో రూ.42లక్షలు వెచ్చించి ఆరేళ్ల క్రితం రెండు పౌరసరఫరాల గోదాములను ఆ శాఖ అధికారులు నిర్మించారు. ఒక్కో దాని సామర్థ్యం 500 మెట్రిక్ టన్నులు. అయితే వాటిని నేటికి వినియోగంలోకి తేలేదు. దీంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. దీనిపై ఉరవకొండ ఇన్‌ఛార్జి సీఎస్‌డీటీ భోగనగౌడ్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. **- న్యూస్‌టుడే, ఉరవకొండ**

## మురుగు తొలగదు.. దుర్వాసన వీడదు

ఉరవకొండ అంబేడ్కర్ నగర్‌లో నివాస గృహాల మధ్య మురుగు పేరుకు పోయింది. దానిని ఎప్పటికప్పుడు తొలగించక పోవడంతో ఆ ప్రదేశంలో దుర్వాసన నెలకొంది. దోమల ఉధృతి అధికం కావడంతో అనారోగ్య బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. దీనిపై ఎంపీడీవో రవిప్రసాద్‌ను వివరణ కోరగా శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.
**-న్యూస్‌టుడే, ఉరవకొండ**



## ప్రహరీ నిర్మించరూ..



మండలంలోని కేపీదొడ్డిలోని ప్రాథమిక పాఠశాల ప్రహరీ పూర్తిగా పడిపోయింది. 80శాతం మేర పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ప్రహరీ లేక పోవటంతో పాఠశాల భవనం అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారుతోంది. ఈ విషయంపై ఎంఈఓ సోమశేఖర్ మాట్లాడుతూ నాడు-నేడు పనులు మంజూరు కాగానే అసంపూర్తిగా ఉన్న ప్రహరీలను పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. **-న్యూస్‌టుడే, గుమ్మఘట్ట**

## స్తంభాన్ని ముట్టుకుంటే షాక్

మండలంలోని నారాయణపురం ఓసీ కాలనీలో ఇనుప విద్యుత్తు స్తంభం ఏర్పాటు చేశారు. చిన్నపాటి చినుకులు కురిసినా, గాలులు వీచినా స్తంభానికి విద్యుత్తు సరఫరా కావడంతో షాక్ కొడుతుందని కాలనీవాసులు వాపోతున్నారు. అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. దీనిపై విద్యుత్తుశాఖ గ్రామీణ ఏఈ రాఘవేంద్రను వివరణ కోరగా క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.
**- న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం**



## మరుగుదొడ్లకి తలుపులేవీ?



పట్టణంలోని కోటలో మూడు, నాలుగు వార్డు డిపెప్ పాఠశాల వద్ద కొత్తగా రెండు మరుగు దొడ్లను నిర్మించారు. గుత్తేదారు నెలలు దాటినా వాటికి తలుపులు, నీటి సౌకర్యం, లెట్రిన్ బేసిన్‌లు ఏర్పాటు చేయకపోవటంతో నిరుపయోగంగా మారాయి. ఈ విషయమై ఎంఈవో మహమ్మద్ ఇర్షాద్‌ను వివరణ కోరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.
**-న్యూస్‌టుడే, రాయదుర్గం**

## మట్టి దారిలో రాకపోకలెలా?

రాయదుర్గం పట్టణంలోని కణేకల్లు రోడ్డులో గాంధీ పాఠశాల సమీపంలో సీసీ దారులు లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పాఠశాల సమీపంలో మట్టి దారి గుంతలు పడి అధ్వానంగా తయారైంది. చిన్నపాటి చినుకులు రాలినా వర్షపు నీరు నిలిచి అపరిశుభ్రత నెలకొంటోంది. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డిను వివరణ కోరగా సీసీ దారి నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.
**- న్యూస్‌టుడే, రాయదుర్గం పట్టణం**



## కాలనీలు.. సమస్యలకు నిలయాలు

### మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం

**ఉరవకొండ, న్యూస్‌టుడే:** కాలనీల్లో కనీస వసతులు నేటికి స్థానిక ప్రజలు అవస్థలు పడుతున్నారు. వాటిని సమకూర్చే దిశగా చర్యలు కనిపించక పోవడంతో వారు నానా తంటాలు పడుతున్నారు. ఉరవకొండ శివరామిరెడ్డి కాలనీలో దాదాపు వెయ్యి కుటుంబాలు జీవిస్తున్నాయి. 3 వేలకు పైగా జనాభా ఉంది. పట్టణంలోని పెద్ద కాలనీల్లో ఇదొకటి. ఇక్కడ ఎక్కువ మంది సామాన్య, మధ్య తరగతి ప్రజలే అధికం. కాలనీ ఏర్పడి రెండు దశాబ్దాలు దాటినా.. అధికారుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి నోచుకోవడం లేదు.

#### సమస్యలు ఇవీ..

కాలనీలను పలు చోట్ల ఊరికి శివారు ప్రాంతాల్లో కేటాయించడంతో మట్టిరోడ్డుపైగా నల్లమట్టితో ఉన్నాయి. దీంతో చిన్నపాటి వర్షం పడినా బురదగా మారిపోతుంది. సీసీ దారుల నిర్మాణం కొన్ని వీధులకే పరిమితమైంది. మరికొన్ని చోట్ల విద్యుత్తు సదుపాయం అంతంత మాత్రమే. కట్టెల మీదనే తీగలను లాక్కోవాల్సిన దుస్థితి. కాలనీ వెనుక భాగాన కొన్ని కుళాయిలకు మాత్రమే నీరు సరఫరా అవుతుంది. అక్కడక్కడ ఏర్పాటు చేసిన చిన్న నీటి ట్యాంకులు సరిగా పని చేయవు. ఇక డ్రైనేజీ వ్యవస్థ శూన్యం. దీంతో వ్యర్థపు నీరంతా రహదారులపై తాండవం చేస్తుంది.

#### ఇక్కడా పరిస్థితి ఇంతే...

పట్టణంలో శివరామిరెడ్డి కాలనీ శివారు ప్రాంతంలో బాలికల గురుకులం వెనుక జగనన్న కాలనీని ఏర్పాటు చేశారు. స్థలాలు పొందిన లబ్ధిదారుల్లో పలువురు ఇళ్లను నిర్మించుకుని అక్కడే నివసిస్తున్నారు. కాలనీలో పక్కా దారులూ కరవే. నీటి సమస్య తీవ్రంగా ఉంది. బోర్లు వేయించినా అవి అందుబాటులో లేవు. దూరం నుంచి నీటిని తెచ్చుకునే పరిస్థితి నెలకొంది. కాలనీలో ఎక్కువ భాగం కంపచెట్లు పెరగడంతో రాత్రివేళ విష పురుగులు సంచరిస్తున్నాయి. అధికార యంత్రాంగం కనీసం వాటిని తొలగించే దిశగా చర్యలు చేపట్టింది లేదు. పంచాయతీ అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



జగనన్న కాలనీలో ఇళ్ల చుట్టూ కంపచెట్లు పెరిగాయిలా..

#### నిధుల మంజూరుకు ప్రతిపాదిస్తాం..

ఆయా కాలనీల్లో క్షేత్రస్థాయిలో వివరాలను సేకరించి, ఎక్కడెక్కడ వసతులను కల్పించాల్సి ఉందో ముందుగా గుర్తిస్తాం. ఆ దిశగా వాటికి ప్రతిపాదనలు తయారు చేసి, నిధుల మంజూరుకు ప్రతిపాదిస్తాం. నిధులు సమకూరే కొద్ది సదుపాయాలను కల్పించేలా చర్యలు తీసుకుంటాం. **- రవిప్రసాద్, ఎంపీడీవో**

## అంజన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్రత్యేకాలంకరణలో ఆంజనేయుడు

**బొమ్మనహాళ్, న్యూస్‌టుడే:** మండలంలోని సుప్రసిద్ధ నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. 30 నుంచి సెప్టెంబర్ 5 వరకు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త శ్రీనాథ్, ఈవో నరసింహారెడ్డి, ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్ తెలిపారు. అందులో భాగంగా ఆదివారం సాయంత్రం ఆంజనేయస్వామికి పవిత్ర జలంను ఊరేగింపుగా తీసుకొచ్చి పూజలు చేశారు. 31న ధ్వజారోహణం, సెప్టెంబర్ 1న సుందరకాండ పారాయణం, 2న సుదర్శనహోమం, 3న సీతారామ కల్యాణోత్సవం, 4న శ్రీరామ పట్టాభిషేకం, 5న శ్రీవారికి విశేష అలంకారం, 6న ఆంజనేయస్వామి బ్రహ్మరథోత్సవం ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

## కనకదాస సామాజిక భవనానికి భూమిపూజ

**గార్లదిన్నె, న్యూస్‌టుడే:** గార్లదిన్నెలో కనకదాస సామాజిక భవన నిర్మాణానికి ఆదివారం కురబ సంఘం నాయకులు భూమిపూజ చేశారు. అనంత ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ, ఏడీసీసీ బ్యాంకు ఛైర్మన్ ఎం. కేశవరెడ్డి సహకారంతో భవనానికి 98 సెంట్లు స్థలం కేటాయించారని సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు ఆవుల కృష్ణయ్య, మాజీ ఎంపీపీ వెంకటనారాయణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రామచంద్ర, తెదేపా కన్వీనర్ పాండు, కురబ సంఘం గౌరవాధ్యక్షుడు ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

## డీఐఈవో పోస్టుల మంజూరు చేయాలని వినతి

**అనంతపురం విద్య, న్యూస్‌టుడే:** ఇంటర్మీడియట్ విద్యాస్థాయిలో డీఐఈవో పోస్టులు మంజూరు చేయాలని జూనియర్ అధ్యాపకుల సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్‌కు ఈ మేరకు వినతిపత్రం పంపించారు. కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాలకు పాఠశాల స్థాయిలో 15 డీఈవో పోస్టులు ప్రభుత్వం మంజూరు చేసింది. అదే తరహాల్లో ఇంటర్మీడియట్ స్థాయిలో కొత్త జిల్లాలకు 15 డీఐఈవో పోస్టులు మంజూరు చేయాలని కోరారు.

## ఉల్లి ధర.. ఊరిస్తోంది

### ఆనందంలో రైతులు



మార్కెట్‌కు తరలించేందుకు ఉల్లిని సిద్ధం చేస్తున్న రైతులు

**గుమ్మఘట్ట, న్యూస్‌టుడే:** ఉల్లి రైతు పంట పండింది. గత మూడేళ్లుగా లేని ధరలు నేడు మార్కెట్‌లో ఘాటెక్కుతున్నాయి. ప్రస్తుతం క్వింటా ఉల్లి రూ.3వేలు నుంచి రూ.4 వేల వరకు పలుకుతుండటంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎల్‌నినో ప్రభావంతో 2026 ఏడాదిలో ఉల్లిసాగు కూడా భారీగా తగ్గిపోవటంతో డిమాండ్ పెరిగిందని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

#### 30వేల పెట్టుబడితో మంచి దిగుబడి..

గుమ్మఘట్ట మండలంలోని భూతయ్యదొడ్డికి చెందిన రైతు రామన్న రూ.30 వేలు పెట్టుబడి పెట్టి ఎకరంలో ఉల్లి సాగు చేశారు. దిగుబడి ఆశాజనకంగా రావటంతో దాదాపు 80 క్వింటాళ్ల వరకు చేతికందింది. క్వింటా ఉల్లి ధర మార్కెట్‌లో రూ.3వేల నుంచి 4 వేలు పలుకుతుందని.. బెంగళూరు ఉల్లి మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధం చేస్తున్నాని రైతు తెలిపారు.

#### సాగు వివరాలిలా..

ఒకప్పుడు ఉల్లి పంటకు ప్రసిద్ధి గాంచిన రాయదుర్గం నియోజక వర్గం ప్రస్తుతం సాగు విస్తీర్ణం పూర్తిస్థాయిలో తగ్గిపోయింది. ప్రధానంగా రాయదుర్గం, గుమ్మఘట్ట మండలాల్లో 60శాతం మంది వందల ఎకరాల్లో ఉల్లి సాగు చేసేవారు. మూడేళ్లుగా ధరలు లేకపోవటంతో పెట్టుబడి చేతికందక సాగును తగ్గించేశారు. ప్రస్తుత సీజన్ 2026లో బొమ్మనహాళ్ మండలం 29ఎకరాలు, హీరేహాళ్ మండలంలో 46, గుమ్మఘట్ట 68, కనేకల్లు 38, రాయదుర్గం 32.. మొత్తంగా 213 ఎకరాలు మాత్రమే ఉల్లి సాగు చేశారు.

#### ప్రత్యామ్నాయ పంటల వైపు..

**- నిర్మల్‌కుమార్, ఏవో, వ్యవసాయశాఖ**

ధరల హెచ్చు తగ్గుల వల్ల ఉల్లి సాగు ఘననీయంగా తగ్గిపోయింది. చాలా మంది రైతులు ప్రత్యామ్నాయ పంటలపై మొగ్గు చూపారు. చాలా వరకు పత్తి, మొక్కజొన్న తదితర పంటలను సాగు చేసుకున్నారు. జిల్లాలోనే ఎక్కువగా పండించే రాయదుర్గం ప్రాంతంలో నేడు పూర్తిస్థాయిలో సాగు తగ్గిపోయింది.

## వైకాపా మోసపూరిత ప్రచారం తగదు

**ఉరవకొండ, న్యూస్‌టుడే:** తుంగభద్ర, శ్రీశైలం జలాశయాల్లో నీటి నిల్వలు పూర్తిస్థాయిలో లేవని తెలిసినా.. వైకాపా నాయకులు రైతుల్లో అలజడులు సృష్టించేలా మోసపూరిత ప్రచారానికి తెరలేపడం దారుణమని తెదేపా రైతు విభాగం నాయకులు ఎర్రగుంట్ల వెంకటేశ్, చంద్ర, సుధాకర్, శేషు, లోకేశ్ పేర్కొన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. ఇటీవల వైకాపా మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ధర్నా చేయడంతో జలవనరుల అధికారులు హెచ్చెల్సీ, జీబీసీ ఉప కాలువలకు సాగునీటి విడుదల చేశారంటూ.. సామాజిక మాధ్యమాల్లో వైకాపా శ్రేణులు ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ధర్నాకు రైతులు ఎవరూ రాకపోవడంతో అయోమయంలో పడిన ఆయన మతిభ్రమించి నీటిని విడుదల చేసినట్లు ప్రచారం చేసుకుంటున్నారని చెప్పారు. దీనిని వైకాపా నాయకులు గుర్తిస్తే మంచిదని హితవు పలికారు. సమావేశంలో తెదేపా నాయకులు కొకుంట్ల రవి, రామాంజనేయులు, చౌడప్ప, పవన్, భీమ తదితరులు పాల్గొన్నారు.

## బస్సు డ్రైవర్‌పై దాడి

**బెళుగుప్ప, న్యూస్‌టుడే:** ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి చేసిన ఘటన మండలంలోని శీర్పి గ్రామం వద్ద ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలు మేరకు.. ఉరవకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శీర్పి మీదుగా కళ్యాణదుర్గం వెళుతుంది. శీర్పి గ్రామం దాటిన తరువాత మారెమ్మ గుడి వద్ద విరుపాపల్లి గ్రామానికి చెందిన మంజు ఎదురుగా వచ్చి తన ద్విచక్ర వాహనాన్ని రోడ్డుపై ఆపి, బస్సు డ్రైవర్ లాలుస్వామితో ఎందుకు అంత వేగంగా వెళ్తున్నావంటూ.. గొడవకు దిగి అసభ్య పదజాలంతో దూషించాడు. ఈ క్రమంలోనే అతనిపై దాడి చేశాడు. స్థానికుల చొరవతో అంతా సర్దుమనిగింది. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## రెండు కార్లు ఢీకొని ఇద్దరికి గాయాలు

**విడపనకల్లు, న్యూస్‌టుడే:** రెండు కార్లు అతి వేగంగా వచ్చి ఎదురెదురుగా ఢీకొన్న ఘటన మండలం మాళాపురం వద్ద 42వ జాతీయ రహదారిలో చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు బళ్లారి నుంచి బెంగళూరుకు కారులో మల్లికార్జున, అక్కమహాదేవి ఇద్దరు వస్తుండగా.. ఉరవకొండ వైపు నుంచి శంకర్ తన కారులో వెళ్తుండగా మాళాపురం మలుపు వద్ద అవి రెండు వేగంగా ఢీకొన్నాయి. కారులో ఉన్న అక్కమహాదేవికి తలకు తీవ్ర గాయాలు కాగా.. శంకర్ గాయపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలించారు. రెండు కార్లు ఢీకొన్న సమయంలో ఎయిర్ బ్యాగ్‌లు తెరుచుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై పోలీసులు వివరాలు సేకరించారు.

# గుంతకల్లు
• గుంతకల్లు • శింగనమల • తాడిపత్రి

## వర్షం కురవాలని బొడ్రాయికి పూజలు


బొడ్రాయికి నీరు పోస్తున్న మహిళలు

**గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే:** మండలంలోని పాతకల్లూరు గ్రామంలో ఆదివారం వానలు కురవాలంటూ గ్రామస్తులు అందరూ కలిసి బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు 101 బిందెలతో నీరు తెచ్చి బొడ్రాయిపై పోశారు. అనంతరం శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయం వద్ద నున్న రావి, వేప వృక్షాలకు వేదమంత్రాల మంత్రోచ్ఛారణ నడుమ సంప్రదాయబద్ధంగా వివాహం జరిపించారు. కార్యక్రమాలను గ్రామ పెద్దలు పర్యవేక్షించారు.

## భక్తిశ్రద్ధలతో రాఘవేంద్రస్వామి ఆరాధన

**బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే:** మండలంలోని గోవిందపల్లి పంచాయతీలో వెలసిన రాఘవేంద్రస్వామి ఆలయంలో ఆదివారం ఆరాధన కనులపండువగా జరిగింది. ఉదయం స్వామి బృందావనాన్ని సుందరంగా అలంకరించి పూజలు చేశారు. పూల పల్లకీలో అర్చకులు స్వామి మూలవిరాట్‌ను ఉంచి గ్రామ వీధుల్లో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకొని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.


పల్లకీలో స్వామిని ఊరేగిస్తున్న అర్చకులు.

## మేమున్నాం.. మీకు తోడుగా

గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 8008612342

**సమస్య:** శింగనమల పంచాయతీ గోవిందరాయుని పేటలో వీధిదీపాలు వెలగడం లేదు. రాత్రివేళలో విష పురుగులు సంచరిస్తున్నాయి. అత్యవసరమై బయటకు వచ్చేందుకు మహిళలు, వృద్ధులు భయపడుతున్నారు. వెంటనే వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలి. **-చక్రపాణిరెడ్డి, గ్రామస్థుడు**

**సమాధానం:** త్వరలోనే కొత్త వీధిదీపాలు అమర్చుతాం. **-విజయకుమార్, డిప్యూటీ ఎంపీడీవో -న్యూస్‌టుడే, శింగనమల**

**సమస్య:** పట్టణంలోని జగజ్జీవన్ కాలనీ దగ్గర గుత్తి బ్రాంచి కెనాల్ నుంచి భీమిరెడ్డి కాలనీకి వెళ్లే మట్టి దారిని సీసీ రోడ్డుగా నిర్మించాలి. **-జాన్, స్థానికుడు**

**సమస్య:** గుంతకల్లులో కసాపురం మార్గంలో రైల్వే వంతెన వద్ద రోడ్డు దెబ్బతిని రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. **-అనుమేశ్, వాహనచోదకుడు**

**సమాధానం:** క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. **-హరికృష్ణ, పురపాలిక ఏఈ, గుంతకల్లు -న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం**

**సమస్య:** మండలంలోని రాయలచెరువు నుంచి లారీల్లో తరలిస్తున్న బొగ్గు కింద పడుతుండటంతో ద్విచక్ర వాహన చోదకులకు ఇబ్బందిగా ఉంది. **-రామచంద్ర, వాహనచోదకుడు**

**సమాధానం:** లారీలకు పట్టాలు కట్టుకుని తరలించేలా చర్యలు తీసుకుంటాం. **-గోపాల్, ఎస్సై, యాడికి, -న్యూస్‌టుడే, యాడికి**

## ఆగిన జాతీయ రహదారి ఆధునికీకరణ
### అవస్థలు పడుతున్న ప్రయాణికులు


బీరప్ప కూడలి వద్ద జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలు

**గుంతకల్లు, న్యూస్‌టుడే:** గుంతలమయమైన జాతీయ రహదారి ఆధునికీకరణ పనులు పురపాలిక పైపులైను కారణంగా నెల రోజుల క్రితం ఆగిపోయాయి. నెల్లూరు-అకోలా జాతీయ రహదారి పాతగుంతకల్లు మీదుగా వెళుతోంది. నేషనల్ హైవే అధికారులు రూ. 30 కోట్లతో గుత్తి నుంచి గుంతకల్లు వరకు మరమ్మతులు చేపట్టారు. ఇందులో పాతగుంతకల్లు పరిధిలో బీరప్పకూడలి నుంచి వాల్మీకి కూడలి వరకున్న దాదాపు కిలోమీటరు పొడవు ఉన్న రోడ్డు పనులు నిలిచిపోవడంతో పట్టణవాసులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**అవరోధంగా మారిన పైపులైను**

దీనికి కారణం పట్టణ పురపాలిక తాగునీటి పైపులైను. 40 ఏళ్ల క్రితం పాతగుంతకల్లుకు తాగునీరు సరఫరా చేసేందుకు జాతీయ రహదారి మధ్యలో పైపులైను వేశారు. భారీ వాహనాల రాకపోకలతో ఇది దెబ్బతిని నీరు లీకేజీ కావడం సాధారణంగా మారింది. ఫలితంగా నీరు నిలిచి పాతగుంతకల్లు రోడ్డు గుంతలతో నిండిపోయింది. ఈ మార్గంలో వెళ్లే భారీ వాహనాల చక్రాల ఇరుసులు విరిగిపోతుండగా.. చిన్న వాహనాలు దెబ్బతింటున్నాయి. నిమిషానికి 300 వాహనాలు వెళ్లే ఈ రోడ్డును ఇప్పుడు ఆధునికీకరిస్తే పైపులైను మరమ్మతులు కష్టమవుతాయని, దీన్ని తొలగించి పక్కన ఏర్పాటు చేసేవరకు పనులు ఆపాలని పట్టణ పురపాలిక అధికారులు నేషనల్ హైవే అథారిటీకి విన్నవించారు. ఫలితంగా పనులు ఆగాయి. పురపాలిక అధికారులు పైపులైను తొలగింపులో మీనమేషాలు లెక్కిస్తున్నారు. గుంతల మార్గంలో చోదకులు, ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు.

**త్వరలోనే మారుస్తాం**

రోడ్డు మధ్యలో ఉన్న తాగునీటి పైపులైన్‌ను త్వరలోనే తొలగిస్తాం. దాన్ని రహదారి పక్కగా ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. అంతవరకు రహదారి ఆధునికీకరణ ఆపాలని కోరిన మాట వాస్తవమే.
**-ఇంతియాజ్, పురపాలిక ఈఈ, గుంతకల్లు**

## గుంటి సుబ్రహ్మణ్యేశ్వరుడికి శ్రావణ శోభ

**గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే:** మండలంలోని కోటంక గ్రామ సమీప కొండల నడుమ వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ మాసం ఆదివారం విశేష పూజలు జరిగాయి. ప్రధాన అర్చకుడు రామాచార్యుల ఆధ్వర్యంలో మూలవిరాట్‌కు రకరకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అర్చనలు, ఆకుపూజ, పుష్పాలంకణ తదితరాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

**వెండి పూలహారం బహూకరణ:** కర్ణాటకలోని బళ్లారికి చెందిన భక్తురాలు మోదుపల్లి జానకమ్మ స్వామిని దర్శించుకుని.. 68 గ్రాముల బరువైన రూ. 20,770 విలువచేసే వెండి పూలహారాన్ని బహూకరించారు.


ప్రత్యేక అలంకారంలో స్వామివారు

## వీరభద్రస్వామి ఆలయంలో..



**పెద్దవడుగూరు, న్యూస్‌టుడే:** పెద్దవడుగూరు సమీపంలోని వీరభద్రస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు మూలవిరాట్‌కు అభిషేకాలు చేసి సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు తమ ఇంటివేల్పు అయిన స్వామికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

## కనకదాస సామాజిక భవనానికి భూమిపూజ


భూమిపూజలో పాల్గొన్న కురబ సంఘం నాయకులు

**గార్లదిన్నె, న్యూస్‌టుడే:** గార్లదిన్నెలో కనకదాస సామాజిక భవన నిర్మాణానికి ఆదివారం కురబ సంఘం నాయకులు భూమిపూజ చేశారు. అనంత ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, ఏడీసీసీ బ్యాంకు ఛైర్మన్ ఎం. కేశవరెడ్డి సహకారంతో భవనానికి 98 సెంట్లు స్థలం కేటాయించారని సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు ఆవుల కృష్ణయ్య, మాజీ ఎంపీపీ వెంకటనారాయణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రామచంద్ర, తెదేపా కన్వీనర్ పాండు, కురబ సంఘం గౌరవాధ్యక్షుడు ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

## వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు రూ.లక్ష విరాళం

మండలంలోని బొందలవాడ గ్రామంలో వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు వెంకట్ వకుల ఫౌండేషన్ ఛైర్మన్ ఆలం వెంకట నరసా నాయుడు రూ.లక్ష విరాళం అందజేశారు. విగ్రహం కొనుగోలుకు అయ్యే మొత్తాన్ని తానే భరిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామానికి చెందిన వాల్మీకి సోదరులు కృతజ్ఞతలు తెలిపారు. **-న్యూస్‌టుడే, నార్పల**



## డిగ్రీలో పాఠ్యాంశంగా పూర్వ విద్యార్థి రచన


నవలను చూపుతున్న ప్రధానాచార్యుడు లక్ష్మయ్య

**గుంతకల్లు, న్యూస్‌టుడే:** పట్టణంలోని ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థి చెట్టనాథన్ రాసిన ఆంగ్ల నవలల్లో ఒకటైన 'కసాపురం అంజనమ్మ' కథను డిగ్రీ ద్వితీయ ఏడాది మూడో సెమిస్టర్‌లో పాఠ్యాంశంగా పెట్టారు. చెట్టనాథన్ ప్రస్తుతం ముంబయిలో బ్యాంకింగ్ రంగంలో విధులు నిర్వహిస్తున్నారు. ఆయన కొన్ని నవలలు రాశారని కళాశాల ప్రధానాచార్యుడు లక్ష్మయ్య తెలిపారు. కసాపురం అంజనమ్మ పేరుతో రాసిన కథలో ఆమె పేదరికాన్ని, ఎదురైన సమస్యలను ఎలా ఎదుర్కొని జీవితాన్ని చక్కగా మలచుకుందో తెలిపారని చెప్పారు. విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా ఉంటుందని అంజనమ్మ కథను ఆంగ్ల పాఠ్యాంశంలో పొందుపరిచామని ఆయన వివరించారు.

## పల్లె ఉమ వర్ధంతిన సేవా కార్యక్రమాలు

**గుత్తి, న్యూస్‌టుడే:** గుత్తి పట్టణంలోని శ్రీసాయి డిగ్రీ, ఎంబీఏ, జూనియర్ కళాశాలల్లో మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి సతీమణి ఉమ వర్ధంతిని అధ్యాపకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. బాలాజీ ఎడ్యుకేషనల్ సొసైటీ మాజీ అధ్యక్షురాలైన ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాళ్లు వెంకటేశ్వరరెడ్డి, ప్రసన్నకుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ప్రిన్సిపల్ చొరవ..ఆడిటోరియం నిర్మాణం


అందుబాటులోకి వచ్చిన భవనం

**బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే:** బుక్కరాయసముద్రంలోని కస్తూర్బా విద్యాలయానికి ప్రిన్సిపల్, ప్రత్యేక అధికారి నాగసత్య చొరవతో రూ. 23 లక్షలతో నిర్మించిన ఆడిటోరియం సమకూరింది. ఇక్కడ 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు 280 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, పరీక్షల నిర్వహణ, సభలు, సమావేశాలకు తగిన భవనం లేక విద్యార్థినులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో నాగసత్య ఎలాగైనా ఆడిటోరియం సమకూర్చాలని తపించారు. దాత క్యాటరింగ్ రమణ దృష్టికి సమస్యను తెచ్చారు. ఆయనను ఒప్పించి విజయం సాధించారు. రమణ తన భార్య మీనాక్షమ్మ పేరిట రూ. 23లక్షలతో ఆడిటోరియం నిర్మించారు. కుర్చీలు, ఇతర వసతులు సమకూర్చారు. ప్రస్తుతం ఆమె బదిలీపై గార్లదిన్నె వెళ్లినా, దాత సాయంతో నిర్మించిన భవనం తన చొరవకు సాక్షిగా నిలిచి విద్యాలయానికి సేవలందిస్తోంది. ఆమె చేసిన మంచి పనిని అందరూ హర్షిస్తున్నారు.

## ఆయకట్టు పొలాలకు నీరు ఇవ్వాల్సిందే

**గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే:** హంద్రీనీవా కాలువ గట్లకు రైతులు పెట్టుకున్న మోటర్లు, పంపుసెట్లను అధికారులు బలవంతంగా తొలగించడం తగదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీశ్ అన్నారు. ఆయన ఆదివారం ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో హంద్రీనీవా కింద సాగయ్యే 3.50 లక్షల ఎకరాలకు ప్రభుత్వం సాగునీరు ఇవ్వడం లేదన్నారు. కసాపురం నెట్టికంటి ఆంజనేయ దేవస్థానం అభివృద్ధికి దాతలు విరాళాలు పుష్కలంగా ఇస్తున్నారని, వాటిని పారదర్శకంగా వెచ్చించాలన్నారు. కొత్త ఈవో వచ్చిన తర్వాత విరాళాలతో పనులు చక్కగా చేయిస్తున్నారని ఇన్నాళ్లు అభినందించామన్నారు. ఇప్పుడు కొనుగోలు చేస్తున్న వస్తువుల లావాదేవీలు పారదర్శకంగా జరగడం లేదని ఆరోపించారు. అందరూ కలిసి దాతలిచ్చిన నిధులను ఖర్చు చేయాలని ఈవోను కోరుతున్నామన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు గోవిందు, రాము తదితరులు పాల్గొన్నారు.

## అశ్వర్థ నారాయణుడికి పూజలు


విశేషాలంకారంలో శ్రీచక్రభీమలింగేశ్వరుడు

**పెద్దపప్పూరు, న్యూస్‌టుడే:** మండలంలోని ప్రసిద్ధి చెందిన అశ్వర్థ నారాయణ స్వామి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. ఉదయం ఆలయ ఆవరణలోని అశ్వర్థనారాయణుడు, శ్రీచక్ర భీమలింగేశ్వర స్వామి మూలవిరాట్‌లకు అర్చకులు క్షీరాభిషేకాలు చేశారు. అనంతరం రకరకాల పూలతో స్వాములను అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామివార్లకు మొక్కులు చెల్లించుకున్నారు.

## ఎస్కేయూ ఆచార్యునికి జాతీయస్థాయి అవార్డు

**ఎస్కేయూ, న్యూస్‌టుడే:** శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం సమాజశాస్త్ర విభాగంలో ఆచార్యునిగా పనిచేస్తున్న జీవీ రమణకు సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. ఎం.వి.రావు ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం.లీలామోహన్‌కృష్ణ ఈ అవార్డుకు ఎంపికైనట్లు ప్రకటించారు. సెప్టెంబరు 6న నెల్లూరులో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో జీవీ రమణ అవార్డు అందుకోనున్నట్లు వెల్లడించారు.

### స్త్రీశక్తి భవనం పూర్తయ్యేదెన్నడో..



గుత్తి ఆర్‌ఎస్‌లో ఐదేళ్ల క్రితం మంజూరైన స్త్రీశక్తి భవన నిర్మాణం నేటికీ పూర్తి కాలేదు. దీని వల్ల స్వయం సహాయక సంఘాల మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. పెద్దవడుగూరుకు చెందిన ఓ గుత్తేదారు భవన నిర్మాణ పనులు చేపట్టారు. బిల్లులు కాకపోవడంతో మధ్యలోనే ఆపేశాడు. గుత్తిలో పూర్తిచేశారు. సమావేశాల నిర్వహణకు అవస్థలు పడుతున్నామని, ప్రభుత్వం వెంటనే భవనాన్ని పూర్తి చేయించాలని సంఘం సభ్యులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, గుత్తి**

### ప్రహరీ కూలింది..భద్రత కరవైంది

మండలంలోని బి.పప్పూరులోని జడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీ కూలిపోవడంతో విద్యార్థులకు భద్రత కరవైంది. కుక్కలు, పశువులు లోపలికి వస్తున్నాయి. పిల్లలు ఆడుకునే సమయంలో మీదికి వస్తుండటంతో వారు భయపడుతున్నారు. విద్యాధికారులు స్పందించి వెంటనే ప్రహరీని నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. **-న్యూస్‌టుడే, నార్పల**



### నిరుపయోగంగా ధోబీఘాట్



గుత్తి ఆర్‌ఎస్‌లో రజకులకు నిర్మించిన ధోబీఘాట్ నిరుపయోగంగా మారింది. పంచాయతీరాజ్ ఇంజినీర్లు బోరువేసి పంపుగది, నీటి తొట్టెలు నిర్మించారు. బోరులో నీరు అడుగంటడంతో రజకులు ఇబ్బందులు పడుతున్నారు. దుస్తులు ఉతికేందుకు నీటి సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి వెంటనే దాన్ని వినియోగంలోకి తేవాలని వారు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, గుత్తి**

### వ్యవసాయ గోదాముకు దారేదీ?

గుత్తిలోని వ్యవసాయ గోదాముకు దారిలేక రైతులు అవస్థలు పడుతున్నారు. ఐదేళ్ల క్రితం సర్కారు రూ. 40లక్షలు వెచ్చించి గుత్తి, పామిడి, పెద్దవడుగూరు, యాడికి, శింగనమల మండలాల రైతుల కోసం దీన్ని నిర్మించింది. రెవెన్యూ అధికారులు దారి చూపకుండానే స్థలాన్ని కేటాయించారు. వాహనాలు వెళ్లలేవు. ఇందులో పైపులు, ఇతర యంత్రాలను ఉంచారు. వీటిని బయటకు తేవాలంటే అవస్థలు పడాల్సిందే. ఇకనైనా రెవెన్యూ అధికారులు దారి చూపాలని బాధితులు విన్నవిస్తున్నారు. **-న్యూస్‌టుడే, గుత్తి**





## గుత్తి పురపాలిక కమిషనర్‌గా సురేంద్ర

**గుత్తి, న్యూస్‌టుడే:** గుత్తి పట్టణ పురపాలిక కమిషనర్‌గా సురేంద్ర నియమితులయ్యారు. ఇప్పటివరకు ఉన్న జబ్బార్ మియా సోమవారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు కావలి పురపాలిక మేనేజర్‌గా ఉన్న సురేంద్రను ఇక్కడ కమిషనర్‌గా నియమించారు. ఆయన వచ్చే నెల 2న బాధ్యతలు స్వీకరించనున్నారు.

## విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం



ఎస్బీఐకు చెందిన ఇతర శాఖల్లో పనిచేసిన విరమణ పొందిన విశ్రాంత ఉద్యోగులు పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న బ్యాంకులో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 1990 నుంచి వివిధ బ్రాంచ్‌ల్లో పనిచేసి విశ్రాంతి పొందిన 50 మంది ఒకచోటుకు చేరి తమ అనుభవాలు, జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. **-న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం**

## మహిళపై కత్తితో దాడి

**యాడికి, న్యూస్‌టుడే:** యాడికిలోని చౌడేశ్వరి కాలనీలో నివసిస్తున్న ఓ మహిళపై అదే కాలనీకి చెందిన వ్యక్తి కత్తితో దాడికి పాల్పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు.. కాలనీకి చెందిన మహిళ లీలావతికి మతిస్థిమితం లేదు. ఈ నేపథ్యంలో ఆమె తన ఇంటి పక్కన ఉంటున్న కుటుంబాన్ని తరచు తిట్టేది. తమ ఇంట్లోని వస్తువులు చోరీ చేశారంటూ నిందించేది. భరించలేక వారు ఆమెను కొట్టారు. వారిలో ఒకరు ఆగ్రహంతో ఆమెపై కత్తితో దాడి చేయగా తల, చేతికి గాయాలయ్యాయి. బాధితురాలిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో తాడిపత్రి ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

## ఆగని మోటారు వైర్ల చోరీ

**నార్పల, న్యూస్‌టుడే:** మండల కేంద్రం నుంచి కురగానపల్లికి వెళ్లే మార్గం పక్కనున్న పంటపొలాల్లో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు మోటారు తీగలు చోరీ చేశారు. నార్పల రైతులు పి.రామకృష్ణ, పి.వరదరాజులు, జి.గంగాధర పొలాల్లో వ్యవసాయ బోర్లకు అనుసంధానించిన సుమారు 70 మీటర్ల విద్యుత్తు వైర్లను దుండగులు అపహరించారు. సాగు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కురగానపల్లి, కర్ణపుడికి, పులస నూతల గ్రామాల్లోనూ చోరీలు ఆగడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. వెంటనే పోలీసులు స్పందించి దొంగలను పట్టుకోవాలని బాధిత రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

**పెద్దవడుగూరు, బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే:** పెద్దవడుగూరు, బుక్కరాయసముద్రం మండలాల్లో ఆదివారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. పెద్దవడుగూరు మండలం క్రిష్టిపాడు సమీపంలో 67వ జాతీయ రహదారిపై ఐచర్ వాహనం ఢీకొనడంతో వృద్ధురాలు దస్తగిరమ్మ తీవ్రంగా గాయపడింది. ఆమె ఇంటికి వెళుతూ రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ఐచర్ ఢీకొనడంతో పాదం నుజ్జునుజ్జయింది. స్పందించిన గ్రామస్థులు వాహనాన్ని కనుగొని పోలీసులకు అప్పగించారు. బాధితురాలిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి పంపారు.

● బుక్కరాయసముద్రం చెరువుకట్ట దగ్గర జరిగిన ప్రమాదంలో ప్రవీణ్ కుమార్, లక్ష్మీదేవి అనే వ్యక్తులు గాయపడ్డారు. బుక్కరాయసముద్రానికి చెందిన వీరిద్దరూ ద్విచక్ర వాహనంపై అనంతపురం బయలుదేరారు. చెరువుకట్ట వద్దకు చేరుతుండగా వాహనం అదుపుతప్పి కిందపడటంతో గాయపడ్డారు. స్పందించిన స్థానికులు 108 వాహన సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## దొంగల ముఠా అరెస్టు

**కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే:** ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న తాడిపత్రికి చెందిన ఎరుకలి గంగాప్రసాద్, ఎరుకలి శివప్రసాద్, గుత్తివాసి ఎరుకలి రామాంజనేయులు, కర్నూలులోని ఇందిరాగాంధీనగర్‌కు చెందిన కామ్లే కార్తీక్‌లను కర్నూలు నాలుగో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక స్టేషన్‌లో సీఐ విక్రమ్‌సింహ ఆదివారం వివరాలు వెల్లడించారు. పామిడికి చెందిన రామాంజనేయులు ప్రస్తుతం గుత్తిలో నివసిస్తున్నాడు. గుప్తనిధుల పేరుతో మోసాలకు పాల్పడుతూ పోలీసుల రికార్డులకెక్కాడు. ఇతనికి వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు వ్యక్తులతో పరిచయాలు ఏర్పడ్డాయి. కర్నూలులో మకాం వేసిన నిందితుడు తన స్నేహితులు గంగాప్రసాద్, శివప్రసాద్, కామ్లే కార్తీక్‌లతో కలిసి చోరీలకు పాల్పడేవాడు. ఈ ఏడాది జులై 6న కర్నూలు నగర శివారు ఉల్చాల రోడ్డులో ఉన్న ఆదిత్య నగర్‌లో ఉంటున్న జయంతి మహేశ్వరరెడ్డి ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. సీసీ కెమెరా పుటేజీలో ఓ స్కూటర్ అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు దాని ఆధారంగా దర్యాప్తు చేయగా.. నలుగురు కలిసి నేరం చేసినట్లు తేలింది. పోలీసులు నిందితులను అరెస్టు చేసి 2.5 తులాల బంగారు, 32 తులాల వెండి ఆభరణాలు, స్కూటర్‌ను స్వాధీనం చేసుకున్నారు.

## చేతిలో పైసలు.. కళ్లలో కాంతులు
● స్వయంఉపాధితో రాణింపు

చేతి లోను(బ్యాంకు రుణం)తో మహిళలు చిరు వ్యాపారం మొదలుపెట్టి భవితకు భరోసా కల్పించుకుంటున్నారు. ఫ్యాన్సీ, దర్జీ, బ్యూటీపార్లర్ పెట్టుకొని తమ పిల్లలను చక్కగా చదివించుకుంటూ కుటుంబానికి చేదోడువాదోడుగా నిలుస్తూ అప్పులు తీరుస్తున్నారు. సొంత కాళ్లపై నిలబడి తోటి వనితలకు స్ఫూర్తిగా నిలుస్తున్న వైనాన్ని వారి మాటల్లోనే తెలుసుకుందాం రండి... **-న్యూస్‌టుడే తాడిపత్రి, యాడికి**

### దర్జీగా బతుకు బాట


టైలరింగ్ దుకాణంలో..

మాది తాడిపత్రి పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్ కాలనీ. పాతికేళ్లుగా ఇగుడూరు గంగాభవాని స్వయంసహాయక సంఘంలో సభ్యురాలిని. పలు దఫాలుగా బ్యాంకు రుణాలు పొంది చిరు వ్యాపారాలు చేశా. సక్రమంగా అప్పులు తీర్చడంతో ఇటీవల రూ. 2లక్షలు రుణం వచ్చింది. ఆ డబ్బుతో ఫ్యాన్సీ, టైలరింగ్ షాపు పెట్టా. ఆధునిక డిజైన్లతో దుస్తులు కుట్టి అమ్ముతుండటంతో మంచి ఆదాయం వస్తోంది. ఇప్పుడు మరో ముగ్గురు మహిళలకు శిక్షణ ఇస్తున్నా. ప్రతి నెలా ఖర్చులు పోనూ రూ.20వేలుపైనే వస్తున్నాయి. నా ఇద్దరు కుమార్తెలను ఉన్నత చదువులు చదివించా. భవిష్యత్తులో వ్యాపారాన్ని విస్తరించడంతో పాటు మరికొందరికి ఉచితంగా శిక్షణ ఇవ్వాలన్నదే నా లక్ష్యం. **-వెంకటలక్ష్మి, భగత్‌సింగ్‌నగర్**

### రుణంతో జీవితం మారింది


మహిళకు మేకప్ వేస్తూ..

నా పేరు పార్వతి. మాది యాడికి. పదేళ్ల క్రితం స్వయం సహాయక సంఘంలో చేరా. క్రమం తప్పకుండా పొదుపు చేశా. తొలుత రూ. 50వేలు బ్యాంకు రుణం తీసుకొని ఇంటి వద్దే 'పూజిత' పేరుతో బ్యూటీపార్లర్ పెట్టా. కొన్ని రోజులు కష్టపడినా మెల్లగా వ్యాపారం పుంజుకుంది. చేసిన అప్పు మొత్తం తీర్చేశా. మళ్లీ బ్యాంకు, డ్వాక్రా సంఘం నుంచి రూ. 5.50 లక్షలు రుణం తీసుకుని ఎంబ్రాయిడరీ యంత్రాన్ని కొనుగోలు చేసి వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకున్నా. నెలకు రూ. 20వేలుపైనే ఆదాయం వస్తోంది. మా కుటుంబం సంతోషంగా ఉంది. పిల్లలను బాగా చదివిస్తున్నా. తోటి మహిళలకు బ్యూటీషియన్ టిప్‌లు చెబుతున్నా. ఎంబ్రాయిడరీ నేర్పుతున్నా. భవిష్యత్తులో ఆర్థికంగా మరింత బలోపేతం చెందడమే నా లక్ష్యం. **-పార్వతి, యాడికి**

# అనంతపురం

• అనంతపురం • రాప్తాడు

## ఆకట్టుకున్న జానపద నృత్యాలు



బృంద నృత్యం చేస్తున్న చిన్నారులు

తపోవనం (అనంత గ్రామీణం): శిల్పారామంలో ఆదివారం రాత్రి జరిగిన శాస్త్రీయ, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. పల్లె వాతావరణం ప్రతిబింబించేలా జానపద నృత్యాలు అందరినీ కట్టిపడేశాయి. కూచిపూడి కళాకేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ప్రదర్శనలు అలరించాయి. శాస్త్రీయ నృత్యాలు కూడా అలరించాయి. చిన్నారులు హస్విక, తన్విక, శాన్విక, దుర్గాశ్రీ, జీవన, దీక్ష, కుషికీర్తన, యోగాశ్వినిలు జానపదాలకు లయబద్ధంగా చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

## సీఎం చంద్రబాబుకు స్వాగతం



అనంతపురంలో వివాహ వేడుకకు హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటప్రసాద్, కలెక్టర్ ఆనంద్, ఎస్పీ జగదీశ్. - ఈనాడు, అనంతపురం

## మంత్రితో ఎమ్మెల్సీ భేటీ

ఇటీవల ఎమ్మెల్సీగా నియామకమైన దళవాయి రమాదేవి ఆదివారం మంత్రి పయ్యావుల కేశవ్‌ను అనంతపురం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీకి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి. నగరంతో పాటు జిల్లాలో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని సూచించారు. - న్యూస్‌టుడే, రాంనగర్



## ఇంటింటా చెత్త సేకరణకు.. మళ్లీ క్లాప్?

### తర్జనభర్జన పడుతున్న అధికార యంత్రాంగం



సిద్ధంగా క్లాప్ ఆటోలు

అనంతపురం (అశోక్‌నగర్), న్యూస్‌టుడే: ఇంటింటా చెత్త సేకరణకు మళ్లీ క్లాప్ (క్లీన్ ఆంధ్రప్రదేశ్) ఆటోలను వినియోగించే దిశగా తర్జన భర్జన పడుతున్నారు. వైకాపా హయాంలో వినియోగించగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్ని రోజుల తర్వాత వాటిని వెనక్కి పంపారు. ఏజెన్సీ వారికి నగరపాలక సంస్థ బకాయిలు చెల్లించకపోవడంతో నిర్వాహకులు వాటిని వెనక్కి తీసుకెళ్లారు. అప్పట్లో 42 ఆటోలు చెత్త సేకరణకు వినియోగించారు. ప్రస్తుతం 25 ఆటోలు రెండు రోజుల క్రితం సిద్ధంగా ఉంచారు. ఇప్పటి దాకా క్లాప్ ఆటోలు లేకపోవడంతో నగరపాలికలో అద్దె ట్రాక్టర్ల విధానాన్ని తీసుకొచ్చారు. ఒక్కో ట్రాక్టర్‌కు రోజుకు రూ.2100 ప్రకారం అద్దె చెల్లిస్తున్నారు.

### త్వరలో నిర్ణయం తీసుకుంటాం

క్లాప్ ఆటోలు వచ్చినా ఎలా వినియోగించాలన్నది నిర్ణయం తీసుకోలేదు. అద్దె ట్రాక్టర్ల స్థానంలో వినియోగించే అంశంపై తగు నిర్ణయం తీసుకుంటాం. - రాజారవీంద్రనాథ్ చౌదరి, నగరపాలక ప్రజారోగ్య అధికారి

### డంపింగ్ యార్డుల్లా శివారు ప్రాంతాలు

నగరంలో అద్దె ట్రాక్టర్లతో పాటు నగరపాలికకు చెందిన వాహనాలున్నాయి. రోజుకు 140 నుంచి 150 మెట్రిక్ టన్నుల చెత్త పోగవుతోంది. ఇంటింటా ప్రతి రోజూ సేకరణ సాగడం లేదు. ప్రజలు రోడ్డుపైనే వ్యర్థాలను పడేస్తున్నారు. నగరంలోని పలు శివారు ప్రాంతాలు డంపింగ్ యార్డుల్లా దర్శనమిస్తున్నాయి.

### పూర్తయిన టెండర్ల ప్రక్రియ

స్వర్ణాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో నగరంలో చెత్త సేకరణకు ఈ-ఆటోలు వస్తున్నాయి. అనంతపురంలో 62 వేల నివాసాలు ఉండడంతో వెయ్యి ఇళ్లకు ఒక ఆటో ద్వారా చెత్త సేకరించాలనే ఉద్దేశంతో 62 ఆటోలు తీసుకురావాలని నిర్ణయించారు. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయింది. త్వరలో ఈ-ఆటోలు వస్తున్నాయని ఇటీవల స్వర్ణాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్ నగరానికి వచ్చిన సందర్భంగా ప్రకటించారు. ఈ-ఆటోల వల్ల డీజిల్ ఖర్చులు తగ్గడంతో పాటు కాలుష్య రహితంగా ఉంటాయన్న యోచనతో అమలు చేస్తున్నారు. అయితే ఇంకా ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేయలేదు. మళ్లీ క్లాప్ ఆటోలు చెత్త సేకరణ చేస్తాయా అన్నది ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది.

## మేమున్నాం.. మీకు తోడుగా

అశోక్‌నగర్: 8008573011
రాంనగర్: 8008573001
కమలానగర్: 7032975446

**సమస్య:** రాప్తాడు మండలం ప్రసన్నాయపల్లి పంచాయతీ ఆటోనగర్ కాలనీలో కాలువల్లో మురుగు తొలగించడం లేదు. - మురళి, ప్రసన్నాయపల్లి

**సమాధానం:** కార్మికులను పంపి కాలువల్లో మురుగు తొలగిస్తాం. - మమత, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, రాప్తాడు

**సమస్య:** జేఎన్‌టీయూ నుంచి సప్తగిరి కూడలి వరకు వెళ్లే దారిలో స్పీడు బ్రేకర్లు ఎక్కువగా ఉండటంతో ఇబ్బందిగా ఉంది. - రాజగోపాల్‌నాయుడు, ఎస్‌బీఐ కాలనీ

**సమాధానం:** అవసరం లేని వేగ నిరోధకాలు తొలగిస్తాం.

**సమస్య:** ఆదర్శనగర్ డోరు నంబరు 12/4/796 వద్ద ఖాళీ ప్రదేశంలో తాగునీరు వృథాగా పోతోంది. - నాగేశ్వర్, స్థానికుడు

**సమాధానం:** పరిశీలించి నీటి వృథాను అరికడతాం.

(పై ప్రశ్నలకు నగరపాలక ఈఈ షాకీర్, డీఈ సత్యనారాయణ సమాధానాలు ఇచ్చారు) - న్యూస్‌టుడే, అశోక్‌నగర్

## ప్రతి గ్రామానికి రోడ్డు నిర్మాణం



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ఆత్మకూరు, న్యూస్‌టుడే: నియోజకవర్గం వ్యాప్తంగా ప్రతి గ్రామానికి తారు రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆదివారం పలు అభివృద్ధి పనులకు భూమిపూజ కార్యక్రమాలను ఆమె నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గత వైకాపా పాలనలో ప్రజలు గుంతలు పడిన రోడ్లపై ప్రయాణించి ఇబ్బంది పడుతున్నా ఎవరూ పట్టించుకోలేదని విమర్శించారు. ఆత్మకూరు నుంచి పి.యాలేరు గ్రామం వరకూ 6కి.మీల మేర రూ.3 కోట్లతో తారు రోడ్డు నిర్మాణానికి అనుమతులు వచ్చాయని ఆమె వివరించారు. అనంతరం ఆత్మకూరు నుంచి నుసికొట్టాల గ్రామానికి వెళ్లే రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. రూ.1.10 కోట్లతో 2 కి.మీల మేర తారురోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. రూ.కోటితో వేసిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆత్మకూరులోని చిరువ్యాపారులకు 20 తోపుడు బండ్లను అందించారు. పి.కొత్తపల్లి గ్రామానికి చెందిన చంద్రన్న అనే రైతు గొర్రెలు విషపునీరు తాగి మృతి చెందడంతో రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు.

## ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి

రుద్రంపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ క్లాస్ ఫోర్ ఎంప్లాయీస్ సెంట్రల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గౌస్‌పీరా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఎన్జీవో హోంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 12వ వేతన సవరణ కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసి, 30 శాతం ఐఆర్ ఇవ్వాలన్నారు.

## గుంటి సుబ్రహ్మణ్యేశ్వరుడికి శ్రావణ శోభ

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కోటంక గ్రామ సమీప కొండల నడుమ వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ మాసం ఆదివారం విశేష పూజలు జరిగాయి. ప్రధాన అర్చకుడు రామాచార్యుల ఆధ్వర్యంలో మూలవిరాట్‌కు రకరకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అర్చనలు, ఆకుపూజ, పుష్పాలంకరణ తదితరాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

## 'అతడు అడవిని ప్రేమించాడు' కథా సంపుటి ఆవిష్కరణ



కథాసంపుటిని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

అనంత సాంస్కృతికం: ప్రకృతిలోని ప్రతి ప్రాణిని, అడవులను సంరక్షించుకున్నప్పుడే మానవుని మనుగడకు భరోసా ఉంటుందని వక్తలు పేర్కొన్నారు. విమల శాంతి సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ కథా రచయిత ఉప్పరపాటి వెంకటేశులు రచించిన 'అతడు అడవిని ప్రేమించాడు' కథల సంపుటి ఆవిష్కరణ సభ ఆదివారం జరిగింది. ప్రముఖ కవి విమర్శకుడు తూముచర్ల రాజారాం అధ్యక్షత వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్కేయూ పూర్వ ఉప కులపతి ఆచార్య కుసుమకుమారి మాట్లాడారు. చిత్రావతి కథల ద్వారా కథా సాహిత్యంలో మంచి గుర్తింపు పొందిన ఉప్పరపాటి వెంకటేశులు 'అతడు అడవిని ప్రేమించాడు' తెలుగు సాహిత్యం, రచనల ద్వారా రూపాంతరం చెందిన వ్యక్తిగా కనిపిస్తాడన్నారు. భూమన్, గుంటూరు లక్ష్మీనరసయ్య, డా.శాంతినారాయణ, బండి నారాయణస్వామి, ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి, మల్లెల నరసింహమూర్తి, తరిమెల అమర్నాథ్‌రెడ్డి, డా.నానీల నాగేంద్ర, రెడ్డప్పరెడ్డి తదితరులు మాట్లాడారు.

## డీఐఈవో పోస్టులు మంజూరు చేయాలని వినతి

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ విద్యాస్థాయిలో డీఐఈవో పోస్టులు మంజూరు చేయాలని జూనియర్ అధ్యాపకుల సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్‌కు ఈ మేరకు వినతిపత్రం పంపించారు. కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాలకు పాఠశాల స్థాయిలో 15 డీఈవో పోస్టులు ప్రభుత్వం మంజూరు చేసింది. అదే తరహాల్లో ఇంటర్మీడియట్ స్థాయిలో కొత్త జిల్లాలకు 15 డీఐఈవో పోస్టులు మంజూరు చేయాలని కోరారు.

## ఉపాధ్యాయుల కొరత తీర్చాలి

ఆర్కేనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తగ్గించి..చదువు సవ్యంగా సాగేలా చూడాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్, మాజీ జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్ పేర్కొన్నారు. నగరంలోని గణేనాయక్ భవనంలో జరిగిన ప్లీనరీ సమావేశంలో వారు మాట్లాడారు.

## దివ్యానందభరితం... వ్యాసరాజ ఆరాధనోత్సవం



పుష్పాలంకరణ సేవలో మూలమూర్తులు

అనంత సాంస్కృతికం: నగరంలోని పాతూరు శ్రీవ్యాసరాజ మఠంలో ఆదివారం రాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవం నేత్రపర్వంగా జరిగింది. వ్యాసరాజ మఠాధికారి రామచంద్ర శ్రీకాంత్, మఠం మేనేజర్లు హరి నారాయణ, నాగరాజరావు, రఘునాథ్ ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవంలో తెల్లవారుజామున అష్టోత్తర పారాయణంతో ఉత్సవాన్ని ప్రారంభించి స్వామివారికి పంచామృతాభిషేకం, సంపూర్ణ పుష్పాలంకరణ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం భజన కార్యక్రమం, స్వస్తివచనం ఏర్పాటుచేశారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

## మురుగు నిలిచి.. అవస్థలు మిగిల్చి



రాప్తాడు మండలం బండమీదపల్లి గ్రామంలో పారిశుద్ధ్య సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ఇళ్ల ముందు పెద్దఎత్తున మురుగు నిల్వ చేరుతుండడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. రోజుల తరబడి మురుగు నిల్వ ఉండడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఫలితంగా రోగాల బారిన పడుతున్నట్లు గ్రామస్థులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మురుగు తొలగించి శాశ్వత పరిష్కారం చూపాలని వారు విన్నవిస్తున్నారు.
- న్యూస్‌టుడే, రాప్తాడు

## అలరించిన మ్యూజికల్ నైట్

అనంత సాంస్కృతికం: సినీ నటుడు అక్కినేని నాగార్జున జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి నగరంలోని ఉపాధ్యాయ భవనంలో జరిగిన నాగార్జున మ్యూజికల్ నైట్ సంగీత విభావరి సంగీతాభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. స్థానిక రామ్స్ క్లాస్ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో బోరంపల్లి రామంజి, చంద్రమౌళి, బీఎన్ శ్రీనివాస్, సర్దార్‌బాబు సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో అతిథులుగా డీఆర్వో మాలోల, చైతన్య కళాశాలల ఉపాధ్యక్షుడు బొమ్మినేని శ్రీరాములు, ఆచార్య సుధాకర్ బాబు హాజరయ్యారు. భారీ కేకును కోసి అభిమానులకు పంచిపెట్టారు. అనంతరం గాయనీగాయకులు నాగార్జున చిత్రాల్లోని పాటలను పాడి అలరించారు.

## 20 ఏళ్ల నుంచి మట్టిరోడ్లే



అనంత గ్రామీణం ఉప్పరపల్లి గ్రామ పంచాయతీలోని ఇందిరమ్మకాలనీలో నివాసాల నడుమ మట్టిరోడ్లు దర్శనమిస్తున్నాయి. దీంతో స్థానికులు గుంతలు పడిన దారుల్లో రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారు. 20 సంవత్సరాల కిందట గృహనిర్మాణ పథకంలో భాగంగా ఇక్కడ పక్కా గృహాల నిర్మాణాలు చేపట్టారు. అప్పటి నుంచి కాలనీలో అభివృద్ధి పనులు చేయకపోవడంతో సమస్యగా మారింది. అధికారులు స్పందించి సీసీరోడ్లు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, లెనిన్‌నగర్(అనంతపురం)

## ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలని డిమాండ్

ఆజాద్‌నగర్ (అనంతపురం),న్యూస్‌టుడే: ఉపాధి కోల్పోయే పరిస్థితుల్లో ఉన్న విద్యుత్తు మీటర్ రీడర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని నీలం రాజశేఖర్‌రెడ్డి భవనంలో జరిగిన యూనియన్ సాధారణ సమావేశంలో మాట్లాడారు. విజయవాడలో దీక్షలు చేపట్టినా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు.

## పల్లె ఉమకు నివాళి



నివాళి అర్పిస్తున్న మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి కుటుంబసభ్యులు

రుదంరపేట, న్యూస్‌టుడే: పల్లె ఉమ వర్ధంతి సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అభిమానులు ఆదివారం ఘనంగా నివాళి అర్పించారు. ఆదివారం పల్లె వ్యవసాయ క్షేత్రంలోని పల్లె ఉమ ఘాట్ వద్ద జరిగిన వర్ధంతి కార్యక్రమం జనసంద్రంగా మారింది. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ పల్లె కృష్ణకిశోర్, కేరళం మాజీ డీజీపీ శంకర్ రెడ్డి, ఆయన సతీమణి సౌభాగ్యరాణి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, పార్థసారథి, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, దగ్గుపాటి ప్రసాద్, బండారు శ్రావణి, ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి, పరిటాల శ్రీరామ్, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ బల్లా పల్లవి పాల్గొన్నారు. పీవీకేకే ఐటీ కళాశాల యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, బాలాజీ విద్యా సంస్థల ప్రిన్సిపాళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్కేయూ ఆచార్యునికి జాతీయస్థాయి అవార్డు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం సమాజశాస్త్ర విభాగంలో ఆచార్యునిగా పనిచేస్తున్న జీవీ రమణకు సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. ఎం.వి.రావు ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం.లీలామోహన్ కృష్ణ ఈ అవార్డుకు ఎంపికైనట్లు ప్రకటించారు. సెప్టెంబరు 6న నెల్లూరులో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో జీవీ రమణ అవార్డు అందుకోనున్నట్లు వెల్లడించారు. ఆయన ఎస్కేయూలో 34 సంవత్సరాలుగా సహాయ, ఆచార్యునిగా విధులు నిర్వహిస్తున్నారు.

## ఉపాధి నిధులతో పల్లెవనం అభివృద్ధి

### ఆలయ ఆవరణలో పచ్చదనం పెంపు



పాలవేరు వీరనాగమ్మ ఆలయంలోని పల్లెవనం

లెనిన్‌నగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: అనంత రూరల్ మండలంలోని ఉప్పరపల్లి గ్రామ పంచాయతీ పాలవేరు వీరనాగమ్మ ఆలయం ఆవరణలో అధికారులు పల్లెవనం పేరుతో పచ్చదనం పెంపునకు కృషి చేస్తున్నారు. ఆలయ ఆవరణలో పండ్ల మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. 2024లో ఉపాధి నిధులు మంజూరు చేయించి కూలీలతో మొక్కలు నాటించారు. నాటిన మొక్కలకు పాలవేరు వీరనాగమ్మ ఆలయంలోని నీరు సరఫరా చేస్తున్నారు. రోజూ సంరక్షించడంతో పండ్ల మొక్కలు ఏపుగా పెరిగి ఆహ్లాదకరంగా ఉన్నాయి. ఆలయానికి వచ్చే భక్తులు పల్లెవనంలో సేద తీరుతున్నారు. అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, ఉపాధి కూలీల పర్యవేక్షణలో పండ్లతోటల పెంపకం కార్యక్రమాన్ని వేగవంతం చేస్తున్నారు.

### మొక్కలు సంరక్షిస్తున్నాం

ఆలయ ఆవరణలో విరివిగా మొక్కలు నాటి సంరక్షించడంతో మంచి ఫలితాలు వస్తున్నాయి. ఆలయానికి వచ్చే భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇక్కడ సేద తీరి వెళ్తున్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని మొక్కలు నాటి పచ్చదనం పెంచుతాం. - నరేష్, మొక్కల సంరక్షకుడు

## ముఖ్యమంత్రిని కలిసిన మాజీ గ్రంథాలయ ఛైర్మన్

అనంత సాంస్కృతికం: నగరంలో ఆదివారం జరిగిన తెదేపా జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు కుమారుడు, గుంతకల్లు ఎమ్మెల్యే జయరాం కుమార్తెల వివాహానికి ముఖ్యమంత్రి చంద్రబాబు వచ్చిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సీఎంతో పలు విషయాలపై చర్చించినట్లు మాజీ గ్రంథాలయ ఛైర్మన్ గౌస్‌మొహిద్దీన్ తెలిపారు.

## దేశ ఔన్నత్యాన్ని ఇనుమడించేది సంస్కృతమే



ప్రొఫెసర్ మాడ్గుల ప్రపుల్ల దంపతులను సన్మానిస్తున్న నిర్వాహకులు

అనంత సాంస్కృతికం: నేటి సాంకేతిక యుగానికి సంస్కృతం తోడైతే దేశ ఔన్నత్యాన్ని మరింత గొప్పగా ప్రపంచ దేశాలు కొనియాడుతాయని వక్తలు పేర్కొన్నారు. కేంద్రీయ సంస్కృత విద్యాపీఠం (దిల్లీ) సౌజన్యంతో ఈనెల 25 నుంచి 31 వరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న సంస్కృత సప్తాహాల కార్యక్రమంలో భాగంగా ఆదివారం నగరంలోని శారదా శృంగేరి శంకరమఠంలో సప్తాహ కార్యక్రమం వైభవంగా జరిగింది. వేదికకు సభాధ్యక్షుడిగా పీజీటీ రంగాచార్యులు, ముఖ్య అతిథులుగా వేద బ్రహ్మశ్రీ అర్చకం లక్ష్మీనారాయణ ప్రసాద్‌శర్మ, శతావధాని డా.పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, చిన్మయ మిషన్ ఇన్‌ఛార్జి ఆత్మవిదానందస్వామి హాజరయ్యారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ తెలుగు, సంస్కృత అకాడమీల నుంచి వచ్చిన ప్రముఖులు హాజరయ్యారు. స్థానిక సంస్కృత పండితులైన డా.దుర్భాక వాసుదేవ శాస్త్రి, అనంతపురం ఎస్ఎస్ఎస్ విశ్వవిద్యాలయం సంస్కృత ప్రొఫెసర్ డా.మాడ్గుల ప్రపుల్లను సత్కరించి జ్ఞాపికలు బహుకరించారు. నగరంలోని పలు కళాశాలలు, పాఠశాలలు సంస్కృత శ్లోక పఠనం, సంస్కృత రచన, రామాయణ, భారత గ్రంథాలపై జరిగిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు రాష్ట్ర సంస్కృత అకాడమీ అందించిన ధ్రువపత్రాలు, జ్ఞాపికలను నిర్వాహకులు అనంతపురం సంస్కృత భారతి సభ్యులు డా. ఆశావాది సుధామ వంశి, డా.శ్రీవిద్య, డా. జి సునీల్‌కుమార్, అనంతలక్ష్మి చేతులమీదుగా ప్రదానం చేశారు.



సాంస్కృతిక ప్రదర్శనతో ఆకట్టుకున్న శ్రీవైష్ణవి

## భక్తిశ్రద్ధలతో జిహ్వేశ్వర జయంత్యుత్సవం

అనంత సాంస్కృతికం: స్వకులసాళి కులస్తుల ఆరాధ్య దైవం జిహ్వేశ్వర జయంతి ఉత్సవాలు గుత్తిరోడ్డులోని అంబాభవాని ఆలయంలో ఆదివారం నేత్రపర్వంగా జరిగాయి. స్వకులసాళి సమాజం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పూజల అనంతరం ఊంజల్ సేవ నిర్వహించారు. ఈనేపథ్యంలో అంబాభవాని మాతకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఇద్దరు విద్యార్థినులను పతకాలతో సత్కరించారు. ఉమ్మడి అనంత జిల్లా వ్యాప్తంగా ఇంటర్‌లో ఉత్తమ మార్కులతో రాణించిన ధర్మవరానికి చెందిన రాచూరే శ్రావ్యలక్ష్మికి 2 గ్రాముల పసిడి పతకం, పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన ధర్మవరానికే చెందిన కాంబ్లే స్వర్ణ వెండి పతకాలను సాధించారు. దాత రాచూరే భానుప్రసాద్ చేతులమీదుగా విద్యార్థినులకు పతకాలు పంపిణీ చేశారు. శాస్త్రీయ నృత్యాలు, భగవద్గీత శ్లోకాలు, వ్యాస రచన, యోగాసనాల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

## పార్కింగ్ చేసినవి కాదు.. పట్టుబడినవే



ఈ చిత్రాన్ని చూస్తుంటే ఎక్కడో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు అనుకుంటే పొరపాటే. డ్రంక్ అండ్ డ్రైవ్, వివిధ కేసుల్లో పట్టుబడిన, వాటిని అనంతపురం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిలిపి ఉంచారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో కేసులు నమోదు చేయడంతో రూ.పదివేల జరిమానా చెల్లించడం లేదా జైలుశిక్ష అనుభవించి వాహనం తీసుకోవాల్సి ఉంటుంది. అయితే చాలా మంది కోర్టుకు వెళ్తే పరువు పోతుందని, దానికంటే వాహనం వదులుకోవడమే మేలనుకుని తీసుకెళ్లడం లేదు. అనంతపురం ట్రాఫిక్ స్టేషన్‌లో సుమారు రెండు వందలకు పైగా వాహనాలు ఉన్నాయి. నగర పరిధిలో ఐదు స్టేషన్లకు కలిపి ఏడు వందలకు పైగా వాహనాలు పట్టుబడి ఎండకు ఎండుతూ , వానకు తడుస్తూ శిథిలావస్థకు చేరుతున్నాయి.
- న్యూస్‌టుడే, అనంత నేరవార్తలు

## కొలువుల సాధనకు సన్నద్ధం

• జాబ్ క్యాలెండర్ ప్రకటనతో యువతలో ఉత్సాహం

ఎస్కేయూ, న్యూస్‌టుడే: ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంతో జిల్లాలోని వేలాది మంది యువత, ఉద్యోగార్థుల్లో కొత్త ఉత్సాహం, ఆశలు చిగురిస్తున్నాయి. డీఎస్సీ మినహా ఇతర ఉద్యోగ ప్రకటనలు లేక, వయోపరిమితి దాటి పోతుందేమోనన్న ఆందోళనలు ఉన్న నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ పెద్ద ఊరటనిస్తోంది. 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్ ప్రకటించడంతో నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వాటికి సంబంధించిన ప్రకటనలు త్వరలో విడుదల కానున్నాయి. ప్రభుత్వ కొలువులు సాధించాలన్న పట్టుదలతో అభ్యర్థులు పుస్తకాలతో కుస్తీపడుతున్నారు.

### డీఎస్సీకి సిద్ధమవుతున్నా



డీఎస్సీకి సన్నద్ధమవుతున్నా. త్వరలో విడుదల కానున్న డీఎస్సీలో ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో చదువుతున్నా. నోటిఫికేషన్లు వెలువడుతుండడంతో సంతోషంగా ఉంది. - పవన్‌కుమార్

### పోస్టులు పెంచాలి



ఎస్కేయూలో ఎల్ఎల్‌బీ చదువుతూ, పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నా. గ్రూప్-1, గ్రూప్-2, డీఎస్సీలో పోస్టులు పెంచాలి. గ్రూప్స్‌లో చాలా మందికి అవకాశం కల్పించాలంటే వయోపరిమితి పెంచాలి. - పులిరాజు

### రోజుకు పది గంటలు కేటాయిస్తున్నా



పీజీ పూర్తి చేశా. గ్రూప్స్‌లో ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నా. ఎస్కేయూలో ఉంటూ రోజుకు 8 నుంచి 10 గంటలు చదువుతున్నా. - అమర్‌నాథ్‌రెడ్డి

### మంచి అవకాశం



ఏపీపీఎస్సీ పరీక్షలకు 6 సంవత్సరాలుగా సన్నద్ధమవుతున్నా. జాబ్ క్యాలెండర్ ప్రకటించడం ఆనందంగా ఉంది. ఉద్యోగాలు సాధించాలనే పట్టుదలతో ఉన్నవారికి ఇది మంచి అవకాశం. ఉద్యోగం సాధించడమే లక్ష్యం. - నాగేంద్ర